



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 320 | సోమవారం 08 జూన్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## బీరుట్‌పై ఇజ్రాయిల్ దాడులు

### - ఇరాన్ డ్రోన్లను కూల్చేశాం : అమెరికా
### - పశ్చిమాసియాలో ఆగని ఉద్రిక్తతలు

టెహ్రాన్/వాషింగ్టన్ - సూర్య వాస్తవం



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తూ దాడులు, ప్రతి దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం ఇజ్రాయిల్ సేనలు లెబనాన్‌పై దాడులు కొనసాగించగా, అమెరికా ఇరాన్ డ్రోన్‌లను కూల్చివేసింది. మరోవైపు కువైట్, బహ్రైన్‌లలో ఉన్న అమెరికా స్థావరాలపై

- మిగతా 2లో..




## నేడు ఇండియా జన్‌బంధన్ భేటీ

### - హాజరుకానున్న 23 పార్టీలు డీఎంకే, ఆప్ విముఖత

2లో



## ఎల్పీజీ ధరల పెంపుపై ఖర్గే ఆగ్రహం

### - 12 ఏండ్ల బీజేపీ పాలనలో జనంపై రూ. 530 భారం
### - మోడీ ప్రభుత్వంపై విరుచుకుపడిన కాంగ్రెస్ పార్టీ చీఫ్

2లో




## నిటి ఆయోగ్ సమావేశానికి తమిళనాడు సీఎం

### - ఢిల్లీకి రెండోసారి..

2లో

## ఉత్తరాంధ్రలో రేర్ ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్ హబ్

### - నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం
### - ఏర్పాటుకు పరిశీలించాలని లోకేష్ విజ్ఞప్తి

అమరావతి - సూర్య వాస్తవం



విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో ఉన్న భారీ ఖనిజ వనరుల ఆధారంగా డీప్ ప్రాసెసింగ్ అండ్ రేర్ ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్ హబ్‌ను ఏర్పాటుచేసే అవకాశాలను పరిశీలించాలని రష్యాకు చెందిన ప్రముఖ రేర్ ఎర్త్ మినరల్స్ సంస్థ గిరెడ్మెట్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులను విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. రష్యా పర్యటనలో భాగంగా ఆ సంస్థ ప్రతినిధులతో

- మిగతా 2లో..

## సత్యనారాయణ గారూ...
# రేపు కలుద్దాం!

- చంద్రబాబు ట్వీట్ వైరల్
- చంద్రబాబును చూడాలన్న కామధేనువులంక పెద్దాయన
- వైరల్ అయిన వీడియోకు సీఎం చంద్రబాబు స్పందన
- సిద్ధాంతం పర్యటనలో పెద్దాయనను కలవనున్న సీఎం
- సామాన్యుడి కోరికపై ముఖ్యమంత్రి తక్షణ స్పందన

అమరావతి - సూర్య వాస్తవం



సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక వీడియోపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి, ఒక సామాన్య అభిమాని కోరికను తీర్చడానికి ముందుకొచ్చారు. తనను కలవాలని ఆశగా ఎదురుచూస్తున్న పెద్దాయనను ఉద్దేశించి, "సత్యనారాయణ గారూ.. రేపు సిద్ధాంతంలో కలుద్దాం" అని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా శుక్రవారం పోస్ట్ చేశారు.

**అసలేం జరిగిందంటే..**

ఆంధ్రప్రదేశ్‌లోని కామధేనువులంక గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వృద్ధుడితో ఒక యువకుడు మాట్లాడిన వీడియో ఇటీవల సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ఆ వీడియోలో,

- మిగతా 2లో..



## టీవీకే ప్రభుత్వం కనీసం మూడు నెలలైనా నిలబడుతుందా?

### - 6 నెలల పాటు సర్కార్ పై విమర్శలకు దూరంగా ఉండాలని అనుకున్నాం
### - రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి
### - ప్రభుత్వం అస్పష్టమైన స్థితిలో నడుస్తోంది
### - డీఎంకే నాయకుడు ఎం.కె. స్టాలిన్

2లో

## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందే

### - ఉద్యమానికి ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదు
### - తదుపరి కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తాం : కాక్రోచ్ జనతా పార్టీ

2లో




# రాష్ట్రాభివృద్ధికి కిషన్‌రెడ్డే అడ్డు



- బీజేపీలో ఉండి ఇంకోపార్టీ సహకారం తీసుకుంటున్నాడు
- గతంలో ఇలాచేస్తేనే ఆయన్ని ప్రజలు ఓడించారు
- రాష్ట్రంపట్ల బాధ్యత లేనట్టే వ్యవహరిస్తున్నారు
- ఈనెల 15 తర్వాత ఆయన సంగతి చెప్తా: ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి
- 'ఎంఎంసీ' పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపనలు

హైదరాబాద్- సూర్య వాస్తవం

రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మోకాలడ్డుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. అహ్మదాబాద్‌లో సబర్మతీ రివర్ ఫ్రంట్, ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్, యూపీలో గంగానది రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసుకుంటున్నారనీ, తెలంగాణలో మూసీ నదిని ప్రక్షాళన చేస్తామంటే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని తెలిపారు. హైదరాబాద్ మురికి నల్లగొండ ప్రజలకు కాలుష్యమై కాటేస్తున్నదనీ, ఒక వైపు ఫ్లోరైడ్ సమస్య, రెండో వైపు మూసీ కాలుష్యం, మరోవైపు చచ్చిన శవాల కళేబరాలు నల్లగొండ జిల్లాకు కొట్టుకొస్తుంటే ఆ ప్రాంత ప్రజలు మూసీ ప్రక్షాళన చేయాలని కోరుతున్నారని తెలిపారు. మూసీ బాధితులకు ఇంటికి ఇల్లు, ఉపాధికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిద్దామంటే కేంద్రమంత్రి ఎందుకు ముందుకురావట్లేదని ప్రశ్నించారు. మూసీ రివర్ ఫ్రంట్‌కు అనుమతులు తేవాల్సిన బాధ్యత ఆయనకు లేదా అడిగారు. ఢిల్లీ తర్వాత రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ మెట్రోరైల్ ఇప్పుడు 9వ స్థానానికి పడిపోయిందనీ, దీన్ని 122 కి.మీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపితే దాన్నకి కూడా కిషన్‌రెడ్డే అడ్డుపడుతున్నారని ఆరోపించారు.

రీజనల్ రింగ్ రోడ్డు వస్తే 360 కిలో మీటర్లు అభివృద్ధి జరుగుతుందనీ, గడిచిన రెండున్నరేండ్లలో అభివృద్ధి పనుల సహకారం కోసం 50 సార్లు ఢిల్లీకి వెళ్లి, ఐదు సార్లు ప్రధాని మోడీని కలిసినా పనులు ఆగుతున్నాయంటే దానికి కారణం కిషన్‌రేడ్డే కాదా అని ప్రశ్నించారు. మూసీకి నిధులు, మెట్రోకు అనుమతులు, రీజనల్ రింగ్ రోడ్డును నిర్మించాలన్న బాధ్యత ఈ ప్రాంత బీజేపీ నేతలకు లేదా అని అడిగారు. ఈనెల 15లోపు కేంద్రం 75 లక్ష?ల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనకుంటే, అప్పుడు కేంద్రమంత్రి

- మిగతా 2లో..



## పశ్చిమ గోదావరి జిల్లాలో నేడు ముఖ్యమంత్రి పర్యటన

### -'సిద్ధాంతం'లో రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# బీరుట్‌పై ఇజ్రాయిల్ దాడులు

(మొదటి పేజీ తరువాయి)

క్షిపణులతో ఇరాన్ ప్రతిదాడి చేసింది. బీరుట్‌పై భీకర దాడులు.. లెబనాన్‌లో రాజధాని బీరుట్‌పై ఆదివారం ఇజ్రాయిల్ సేనలు దాడులను ఉధృతం చేశాయి. మార్చి 2 నుంచి లెబనాన్‌పై ఇజ్రాయిల్ జరిపిన ఘోరమైన దాడుల్లో దాదాపు 3,613 మంది మృతి చెందారని, వేలాది మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇజ్రాయిల్, హిజ్బుల్లా మధ్య ఇటీవలే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ దాడులు ఏ మాత్రం ఆగడం లేదు. దక్షిణ లెబనాన్‌లో ఓ సైనిక వాహనంపై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో ఇద్దరు లెబనాన్ సైనికాధికారులు, ఓ సైనికుడు మరణించారు. నబాటియే జిల్లాలో జిఫ్తా రోడ్డుపై ఒక మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిపై దాడి చేసి హత్య చేసింది. దువైర్ పట్టణంలోని ఘమికా పరిసర ప్రాంతంలో నివాస ప్రాంతాలపై ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు దాడులు చేసి ధ్వంసం చేశాయి. నబాతియే నగరం,కఫోర్ పట్టణంపై కూడా కాల్పులు జరిగాయని, అబ్బా,దువైర్ పట్టణాల మధ్య ఉన్న వాతా–అబ్బా రహదారిపై డ్రోన్ దాడి చేయడంతో, ఇద్దరు సిరియన్లు మరణించగా, అనేక మంది గాయపడ్డారని జాతీయ వార్తా సంస్థలు నివేదించాయి.

**ఇరాన్ డ్రోన్లను కూల్చేసాం : అమెరికా**

హర్మూజ్ జలసంధిలో ఇరాన్‌కు చెందిన డ్రోన్‌లను కూల్చివేశామని అమెరికా ప్రకటించింది. జలసంధికి ముప్పు కల్గిస్తున్నాయని అందుకే వాటిపై దాడి చేసామంటూ అమెరికా అధికారులు పేర్కొన్నారు. అయితే అమెరికా తరచూ తన వైఖరిని మార్చుకుంటూ దాడలు చేస్తుందని, పరస్పర విరుద్ధ వైఖరులు అవలంబిస్తోందని, అందుకే శాంతి చర్చలు ముందుకు సాగడం లేదని ఇరాన్ విమర్శించింది. ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై ఆదివారం టెహ్రాన్‌లో ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ పాకిస్తాన్ మధ్యవర్తుల ద్వారా అమెరికాతో సందేశాలు పంచుకుంటున్నామని చెప్పారు. 'వైఖరులను తరచూ మార్చుకుంటున్న కారణంగానే ట్రంప్ ప్రభుత్వంతో చర్చలు జరపడం ఇబ్బందిగా ఉంది. లక్ష్యాలను మార్చుకోవడం, విభిన్న ప్రకటనలు చేయడం, అధికారులు పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యలు చేయడం... ఇవన్నీ చర్చలకు ప్రతిబంధకంగా ఉన్నాయి' అని అన్నారు. ఇరాన్ హక్కులను గుర్తించాలన్న విషయాన్ని అమెరికన్లు అర్థం చేసుకోవాలని, అదే ప్రధాన విషయమని తెలిపారు. అంతర్జాతీయ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం కింద శాంతియుత అణు శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఇరాన్‌కు హక్కు ఉన్నదని విషయాన్ని కూడా వారు గ్రహించాలని చెప్పారు. 'అదే సమయంలో స్తంభింపజేసిన మా ఆస్తుల గురించి అడుగుతుంటే వారు ఎలాంటి రాయితీలు ఇవ్వడం లేదు' అని అన్నారు.

# ఎల్పీజీ ధరల పెంపుపై ఖర్గే ఆగ్రహం

### - 12 ఏండ్ల బీజేపీ పాలనలో జనంపై రూ. 530 భారం
### - మోడీ ప్రభుత్వంపై విరుచుకుపడిన కాంగ్రెస్ పార్టీ చీఫ్

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

ఎల్పీజీ ధరల పెంపుపై కాంగ్రెస్ పార్టీ మోడీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. యూపీఏ హయాంలో ద్రవ్యోల్బణంపై గగ్గోలు పెట్టిన బీజేపీ నేతలు, ఇప్పుడు సిలిండర్లతో నిరసనగా వీధుల్లోకి ఎందుకు రావడం లేదని ప్రశ్నించింది. ఢిల్లీలో 14.2 కేజీల గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.913 నుంచి రూ.942కు పెంచిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చి 7న సిలిండర్‌పై ?60 పెంచిన తర్వాత తాజాగా మరోసారి పెంచిందని, దీంతో గత నాలుగు నెలల్లోనే సిలిండర్ పై మొత్తం ?89కి పెంచిందని అన్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) లబ్ధిదారులు ఏటా మొదటి నాలుగు రీఫిల్స్ పై రూ.300 సబ్సిడీని పొందిన తర్వాత, ప్రతి సిలిండర్‌కు వాస్తవంగా రూ.642 చెల్లిస్తూనే ఉంటారని అన్నారు. మోడీ ప్రభుత్వాన్ని ఖర్గే మూడు ప్రశ్నలు అడిగారు. పశ్చిమాసియా సంఘర్షణకు ప్రతిస్పందనగా 41 దేశాలలో ఇంధన వనరులను వైవిధ్యపరచడం గురించి ప్రధాని మోడీ చేసిన గొప్ప వాగ్దానాల సంగతేమిటని, గ్రామీణ ప్రాంతాల్లో ఈనాటికీ ఎల్పీజీ కొరత ఎందుకు కొనసాగుతోందని ప్రశ్నించారు. అలాగే ఉజ్వల పథకం కింద, 2025–26 సంవత్సరంలో 5.56 కోట్ల కుటుంబాలకు ఒక్క రీఫిల్ కూడా అందలేదని (లేదా ఒక్కటి మాత్రమే అందిందని), వీరిలో 3.30 కోట్ల కుటుంబాలు ఒక్క సిలిండర్ రీఫిల్‌ను కూడా ఎంచుకోలేదని ఆరోపించారు. పశ్చిమాసియా సంక్షోభానికి ముందే ఉన్న ఈ పరిస్థితి మోడీ ప్రభుత్వ లాభార్జన ఫలితం కాదా అని ప్రశ్నించారు. గత 12 ఏండ్లల్లో మోడీ ప్రభుత్వం దేశీయ ఎల్పీజీ ధరలను రూ.530 పెంచిందని, పెరుగుతున్న ధరలు సామాన్యులను నాశనం చేస్తున్నాయని ఖర్గే మండిపడ్డారు. యూపీఏ హయాంలో మోడీ, బీజేపీ నేతలు ద్రవ్యోల్బణంపై పెద్ద రచ్చ చేసేవారు. గత 12 ఏండ్ల మోడీ ప్రభుత్వం దేశీయ ఎల్పీజీ ధరలను రూ.530 పెంచిందన్నది నిజం కాదా? మరి ఇప్పుడు బీజేపీ నేతలు,ఎల్పీజీ సిలిండర్లతో నిరసనగా వీధుల్లోకి ఎందుకు రావడం లేదని నిలదీశారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందే

ముంబయి – సూర్య వాస్తవం

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుందని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకులు అభిజిత్ దీప్కే స్పష్టం చేశారు. మహారాష్ట్ర ఛత్రపతి శంభాజీనగర్‌లోని తన నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. జంతర్ మంతర్ వద్ద తమ ఆందోళన విజయవంతమైందని, వేలాదిమంది హాజరయ్యారని తెలిపారు. తమ ఆందోళనను దేశవ్యాప్తంగా విస్తరింపచేసేందుకు తదుపరి కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తామని అన్నారు. ప్రధాన్ రాజీనామా తర్వాత విద్యా వ్యవస్థను సమూలంగా సంస్కరించడానికి ఒక అజెండాను సిద్ధం చేస్తామని తెలిపారు. ఇతర దేశాల్లో ఆందోళనలతో సిజెపి ఉద్యమాన్ని పోల్చలేమని, సిజెపి జెన్ జెడ్ కోసమేనని, దీనికి ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదని దీప్కే పేర్కొన్నారు. గత 12 ఏండ్లలో దేశ రాజకీయాలు హిందూ -- ముస్లిం ఎజెండా ఆధిపత్యంతో నడుస్తున్నాయని, ఆ ఎజెండాతో నిరుద్యోగులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని విమర్శించారు. నీట్ పేపర్ లీక్‌కు ఎవరో ఒకరు బాధ్యత తీసుకోవాలని, ఎవరూ బాధ్యత తీసుకోకపోతే వ్యవస్థ సమర్థవంతంగా ఎలా పనిచేస్తుందని దీప్కే ప్రశ్నించారు. ఒకటి రెండు తప్పులు చేసినందుకే ఒక ఉద్యోగిని కంపెనీ నుండి తొలగిస్తారని, ప్రభుత్వం నిర్వహించే పరీక్షల ప్రశ్నా పత్రాలు తరచూ లీక్ అవుతున్నా ఎవరూ ఎందుకు బాధ్యత తీసుకోరని నిలదీశారు.

# సత్యనారాయణ గారూ... రేపు కలుద్దాం!

(మొదటి పేజీ తరువాయి)

"చంద్రబాబును ఎప్పుడైనా చూశారా?" అని యువకుడు అడగ్గా, "ఆయన హైదరాబాద్‌లో ఉంటారని అంటారు, నేనైతే చూడలేదు" అని పెద్దాయన అమాయకంగా బదులిచ్చారు. "ఆయన్ను కలవాలని ఉందా?" అని అడగ్గా, సత్యనారాయణ గారు ఎంతో ఉత్సాహంగా, చూడాలనే కోరిక ఉందని చెప్పారు. దీంతో ఆ యువకుడు, ఈ నెల 9న ముఖ్యమంత్రి సిద్ధాంతం వస్తున్నారని, తాను తప్పకుండా కలిసేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఆ మాట వినగానే సత్యనారాయణ గారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ హృద్యమైన వీడియో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి చేరింది. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన, పెద్దాయన కోరికను మన్నిస్తూ నేరుగా ఆయన్నే కలుస్తానని ప్రకటించారు.

# నేడు ఇండియా జన్‌బంధన్ భేటీ

### - హాజరుకానున్న 23 పార్టీలు
### డీఎంకె, ఆప్ విముఖత

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉమ్మడి వ్యూహాన్ని చర్చించి, ప్రతిపక్ష ఐక్యతను బలోపేతం చేసేందుకు నేడు(సోమవారం) దేశ రాజధాని ఢిల్లీలో ప్రతిపక్షాలు భేటీ కానున్నాయి. సోమవారం కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగే 'ఇండియా జన్ బంధన్' సమావేశంలో 23 రాజకీయ పార్టీలు పాల్గొననున్నాయి. ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, శివసేన (ఠాక్రే) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తదితరులు హాజరయ్యే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ సమావేశం 2029 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇండియా బ్లాక్ భవిష్యత్ కార్యాచరణపై చర్చించనుంది. జాతీయ సమస్యలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీయడానికి ఒక ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించనుంది. ప్రతిపక్ష కూటమి తన వైవిధ్యంతోనే ఐక్యంగా నిలుస్తుందని కాంగ్రెస్ పేర్కొంది. అయితే ఈ సమావేశంలో డీఎంకే, ఆప్ పార్టీలు మాత్రం పాల్గొనేందుకు విముఖత వ్యక్తం చేశాయి. కొన్ని పార్టీలు తమ సొంత కారణాల వల్ల ఈ ప్రత్యేక సమావేశానికి హాజరు కాలేమని తెలిపినట్టు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. ' దేశంలో లక్షలాది మంది భారతీయుల ఓటు హక్కును హరించివేస్తున్నారు. ప్రతి రోజు రాజ్యాంగంపై దాడి చేస్తున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్ష నాయకులపై దాడులు చేయిస్తున్నారు. కోట్లాది మంది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నారు. ఎడతెరిపి లేకుండా పెరుగుతున్న అలాగే ఆమ్ ఆద్మీ పార్టీ బహిరంగంగానే ఇండియా బ్లాక్‌కి దూరంగా ఉంది. కేరళలో సీపీఐ(ఎం) బీజేపీతో కుమ్మక్కయిందని కాంగ్రెస్ అగ్ర నేతలు చేసిన ఆరోపణలపై సీపీఐ(ఎం) తీవ్ర విమర్శలు చేసింది.

ఈ మేరకు సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకి లేఖ కూడా రాశారు. ఆ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అటువంటి ఆరోపణలు ప్రతిపక్ష కూటమికి ఆధారమైన సహకార స్ఫూర్తికి విరుద్ధ మని పేర్కొన్నారు. ఆ లేఖను మిగిలిన ఇండియా బ్లాక్ పార్టీల నేతలకు కూడా పంపించారు. అయితే సీపీఐ(ఎం) 'ఇండియా జన్‌బంధన్' సమావేశానికి హాజరు కానుంది. సీపీఐ(ఎం) ప్రతినిధిగా ఆ పార్టీ రాజ్యసభ ఉపనేత జాన్ బ్రిట్టాస్ హాజరుకానున్నారు

# టీవీకే ప్రభుత్వం కనీసం మూడు నెలలైనా నిలబడుతుందా?

- 6 నెలల పాటు సర్కార్ పై విమర్శలకు దూరంగా ఉండాలని అనుకున్నాం
- రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి
- ప్రభుత్వం అస్పష్టమైన స్థితిలో నడుస్తోంది
- డీఎంకే నాయకుడు ఎం.కె. స్టాలిన్

చెన్నై – సూర్య వాస్తవం

తమిళనాడులోని టీవీకే ప్రభుత్వంపై డీఎంకే నేత స్టాలిన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. నూతనంగా కొలువుదీరిన టీవీకే ప్రభుత్వం కనీసం మూడు నెలలైనా నిలబడుతుందా? అని ప్రశ్నించారు. ప్రస్తుత టీవీకే ప్రభుత్వం తీరుతెన్నుల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని అన్నారు. అయితే, టీవీకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు 6 నెలల పాటు విమర్శలకు దూరంగా ఉండాలని అనుకున్నామని, కానీ, రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. టీవీకే ప్రభుత్వం అస్పష్టమైన స్థితిలో నడుస్తోందని పేర్కొన్నారు. చెన్నైలో వీసీకే మాజీ ఎమ్మెల్యే పనైయూర్ బాబు, ఆయన మద్దతుదారులు స్టాలిన్ సమక్షంలో డీఎంకేలో చేరారు. ఈ సందర్భంగా స్టాలిన్ ఈ మేరకు మాట్లాడారు. ఇప్పటికే చాలామంది కొత్త ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని స్టాలిన్ పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచే డీఎంకే, 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం క్షేత్రస్థాయిలో చర్యలు మొదలు పెట్టిందని వెల్లడించారు. బూత్ స్థాయి ఏజెంట్లను నియమించడం, ప్రాంతీయ సమావేశాలు నిర్వహించడం వంటి జాగ్రత్తలు తీసుకున్నా అధికారంలోకి రాలేకపోయామని నిర్వేదం వ్యక్తం చేశారు. కానీ కొందరు మాత్రం ఓటర్లను కలవకపోయినా, బూత్ ఏజెంట్లను నియమించకపోయినా ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని పరోక్షంగా విజయ్‌ను ఉద్దేశిస్తూ స్టాలిన్ అన్నారు. అటువంటి ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉంటుందని తాను భావించట్లేదని తెలిపారు. ఇక, డీఎంకేలో కొత్తగా చేరిన వారికి స్టాలిన్ పలు సూచనలు చేశారు. పార్టీ నిర్వహించే అన్ని సంస్థాగత కార్యక్రమాల్లోనూ సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే, గతంలో అనుబంధం కలిగి ఉన్న పార్టీలను విమర్శించవద్దని సూచించారు.

ఈ సందర్భంగా, పార్టీ వ్యవస్థాపకుడు సీ.ఎన్. అన్నాదురై మాటలను ఉటంకిస్తూ, "ప్రత్యర్థి తోటలోని మల్లెపూవునకు కూడా సువాసన ఉంటుందని అన్నా (అన్నాదురై) గొప్పగా చెప్పారు. కాబట్టి, ఎవరినీ తక్కువ అంచనా వేయాల్సిన అవసరం లేదు" అని స్టాలిన్ దిశానిర్దేశం చేశారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో వీసీకే తరపున చెయ్యూర్ నియోజకవర్గం నుంచి పనైయూర్ బాబు విజయం సాధించారు. అయితే, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల విషయంలో పార్టీ నాయకుడు తిరుమావళవన్ పరస్పర విరుద్ధమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. తరచుగా తన వైఖరిని మారుస్తున్నారని ఆరోపిస్తూ ఆయన వీసీకేను వీడారు.

**టీవీకే ఎక్కువ కాలం అధికారంలో ఉండదు : అన్నాడీఎంకే**

మరోవైపు, తమిళనాడులో టీవీకే ఎక్కువ కాలం అధికారంలో ఉండదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి వ్యాఖ్యానించారు. కుర్చీకి ఉన్న నాలుగు కాళ్లలో రెండు విరిగిపోతే అది ఎలాగైతే కుప్పకూలిపోతుందో, టీవీకే ప్రభుత్వం కూడా అలాగే కూలిపోతుందని విమర్శించారు. "ఇటీవల తమిళనాడులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే సంపూర్ణ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదు. అంతేకాదు, రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో ఒక్క నియోజకవర్గంలో కూడా ఆ పార్టీ గెలవలేకపోయింది. టీవీకే కుర్చీకి రెండు కాళ్లు మాత్రమే ఉన్నాయి. మిగిలిన రెండు కాళ్లు డీఎంకే కూటమిలో గెలిచిన పార్టీలకు చెందినవి. కాబట్టి ఆ పార్టీలు ఎప్పుడైనా విడిపోవచ్చు" అని పళనిస్వామి వ్యాఖ్యానించారు.

**'ఆవేశపూరిత ప్రకటనలు మానుకోవాలి'**

అలాగే, టీవీకే నాయకుడు ఆవేశపూరిత ప్రకటనలు చేయడం మానుకోవాలని పళనిస్వామి అన్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో 436 పథకాలను అమలు చేస్తామని ప్రకటించారని, అయితే, ఆ పథకాలు ఏ శాఖలకు చెందినవి అనే విషయంపై ఎటువంటి వివరాలు వెల్లడించలేదని తెలిపారు. కేవలం పథకాలను ప్రకటించడం ద్వారా టీవీకే ప్రజలను మోసం చేస్తోందని ఆయన విమర్శించారు. ఇదిలా ఉండగా, ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పళనిస్వామి రాష్ట్రంలోనే అత్యధిక ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. తనను భారీ మెజారిటీతో గెలిపించిన ఎడప్పాడి నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయనే స్వయంగా వెళ్లి వారిని కలిశారు. అవిశ్రాంతంగా కృషి చేసిన అన్ని కూటమి పార్టీల నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఎన్నికల్లో గెలిచిన పార్టీ శాశ్వతంగా అధికారంలో ఉండదని వ్యాఖ్యానించారు. ఓటమిని చవిచూసిన పార్టీ కూడా భవిష్యత్తులో అధికారాన్ని చేజిక్కించుకోవచ్చునని, ప్రజల మద్దతుతో అన్నాడీఎంకే కచ్చితంగా తిరిగి అధికారాన్ని సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# రాష్ట్రాభివృద్ధికి కిషన్‌రెడ్డే అడ్డు

(మొదటి పేజీ తరువాయి)

కిషన్‌రెడ్డి సంగతి చెప్తామని హెచ్చరించారు. తుమ్మిడి హెట్టికి సైతం ఆయనే అడ్డుపడుతున్నారనీ, మహారాష్ట్ర సీఎంకు పదిసార్లు లేఖలు రాసినా సమాధానం ఎందుకు రావట్లేదో అర్థం చేసుకోవాలన్నారు. బీజేపీలో ఉంటూనే తెరవెనుక నుంచి మరోపార్టీ సహకారాన్ని ఆయన తీసుకుంటున్నారనీ, గతంలో ఇలా చేస్తేనే ప్రజలు ఆయన్ని ఓడించారని గుర్తుచేశారు. అభివృద్ధి పనులకు అనుమతుల కోసం కేంద్రమంత్రుల దగ్గరికి వస్తానన్నా, కిషన్‌రెడ్డి తీసుకెళ్లట్లేదనీ, కుమ్మక్కు రాజకీయాలు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రి కలిసి వస్తే ఎల్బీ స్టేడియంలో ఆయనకు గండపెండేరం తొడుగుతామని చెప్పారు. ఆదివారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలోని ఉప్పల్ భగాయత్‌లో రూ.1511 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పదెకరాల్లో రూ.98 కోట్లతో నిర్మించనున్న 'ఎంఎంసీ' భవన నిర్మాణం, రూ.960 కోట్లతో ఏఓసీ సెంటర్‌లో ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణం, రూ.416 కోట్లతో టీకేఆర్ కాలేజీ జంక్ష?న్‌లో 6 లైన్ల ఫ్లై ఓవర్ నిర్మాణం, రూ.37.50 కోట్లతో 100 పడకల మల్కాజిగిరి జిల్లా ఆస్పత్రి భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. పరిపాలనా సౌలభ్యం కోసమే 'క్యూర్'ను ఏర్పాటు చేశామని చెప్పారు. నల్లా కనెక్షన్ కావాలన్నా, ఇంటి పర్మిషన్ కావాలన్నా.. ఏదైనా అధికారిని కలవాలంటే ట్యాంక్ బండ్ దగ్గరికి పోవాల్సి ఉండేదనీ, అంతదూరం వెళ్లి ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకే పాలనను వికేంద్రీకరించామన్నారు. జోనల్ కమిషనర్‌కు ఉండే పరిధే డీసీపీకి కూడా ఉంటుందనీ, అన్ని శాఖల సమ న్వయం కోసమే జీహెచ్ఎంసీని మూడుగా విభజించా మని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తనకు సరైన సహకారం అందకపోవడంతో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని, ముఖ్యంగా ఉప్పల్, మల్కాజిగిరి ప్రాంతాల్లో ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానని అంగీకరించారు. గతంలో నగరంలో జీపీలు, జెడ్పీ, మున్సిపాల్టీలు, జీహెచ్ఎంసీ ఇలా నాలుగు రకాల పరిపాలనా విభాగాలు ఉండటంతో సహకారం సరిగ్గా అందక ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తయారుచేయడంతోపాటు రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడానికే 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను తీసుకొచ్చామని చెప్పారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపలనే దాదాపు 2100 స్కోయర్ కిలోమీటర్ల ప్రాంతంలో 1 కోటీ 34 లక్ష?ల జనాభా ఉందనీ తెలిపారు. వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చి ఇక్కడ నివసిస్తున్న వీరిందరికీ మౌలిక వసతులు కల్పిండానికి, పరిపాలనా సమన్వయం కోసం 'క్యూఆర్'గా నామకరణం చేసి జీహెచ్ఎంసీని 3 మున్సిపల్ కార్పొరేషన్లుగా ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఉన్న 7 నియోజకవర్గాల్లో కంటోన్మెంట్ కారిడార్ ఎలివేటెడ్ నుంచి శామిర్‌పేట మెట్రో విస్తరణ పనులతో సహా అన్ని పనులూ పూర్తి చేస్తామన్నారు. గండిపేట నుంచి గాంధీ సరోవర్ వరకు మూసీ ఫేజ్1 మొదటి విడతగా పని చేస్తున్నామనీ, ఫేజ్ 2లో నాగోల్ నుంచి గౌరెల్లి వరకు 100 రోజుల్లో మూసీ ప్రక్ష?ళన పనులను ప్రారంభిస్తామని చెప్పారు.

# ఉత్తరాంధ్రలో రేర్ ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్ హబ్

(మొదటి పేజీ తరువాయి)

మాస్కోలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. భారతదేశానికి ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు గిరెడ్మెట్ వంటి సంస్థలతో సాంకేతిక భాగస్వామ్యం భవిష్యత్తులో విలువైన అవకాశాలను తెరుస్తుందన్నారు. విస్తరిస్తున్న భారత్‌కు ఎలక్ట్రికల్ వెహికల్స్ (ఇవి), పవన విద్యుత్ మార్కెట్లకు సరఫరా చేయడానికి, గిరెడ్‌మెట్ ప్రాసెసింగ్ టెక్నాలజీని ఉపయోగించి నెల్లూరులో ఫుల్ సైకిల్ రేర్–ఎర్త్ శాశ్వత అయస్కాంతాల తయారీ కోసం నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయడానికి భాగస్వామ్యం వహించాలని కోరారు. భారతీయ టెక్ కారిడార్‌లో సిద్ధంగా ఉన్న ప్లగ్–అండ్–ప్లే ప్రయోగశాలల మద్దతుతో మెటలర్జీ అల్ట్రా–ప్యూర్ సెమీకండక్టర్ ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ ల్యాబ్ సహ–స్థాపనకు చొరవ చూపాలని లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో భాగంగా రష్యాలోని అతిపెద్ద అణుశక్తి మ్యూజియం (మాస్కో)ను మంత్రి లోకేష్ సందర్శించారు. విజ్ఞానం, చరిత్ర, సాంకేతికతల సమన్వయ వేదికగా నిలుస్తోన్న ఈ మ్యూజియంను 80 దేశాలకు పైగా చెందిన 35 లక్షల మంది సంద ర్శించినట్టు లోకేష్‌కు నిర్వాహకులు వివరించారు. ఒకేసారి 2,100 మంది వరకు సందర్శకులను ఆతిథ్యం ఇవ్వగల సామర్థ్యం ఈ కేంద్రానికి ఉందని పేర్కొన్నారు. ?

## నిటి ఆయోగ్ సమావేశానికి
# తమిళనాడు సీఎం
### - ఢిల్లీకి రెండోసారి..

చెన్నై - సూర్య వాస్తవం
ఢిల్లీలో జరగనున్న నిటి ఆయోగ్ సమావేశంలో పాల్గొననున్నట్టు సంబంధిత వర్గాలు ఆదివారం తెలిపాయి. ప్రధాని మోడీ అధ్యక్షతన జూన్ 11న న్యూఢిల్లీలో నిటి ఆయోగ్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు హాజరుకానున్నారు. కేంద్రహోంమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలను విజయ్ కలిసే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి హోదాలో ఢిల్లీలో పర్యటించడం ఇది రెండవసారి. జాతీయ రాజధానిలో తన మొదటి పర్యటనలో విజయ్ ప్రధాని మోడీతో సమావేశమయ్యారు.రాష్ట్రవ్యాప్తంగా జల్ జీవన్ మిషన్ 2.0 (ఉయిర్ నీర్ ఇయక్కం)ను అమలు చేసేందుకు తమిళనాడు ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో ఈ నెల 2వ తేదీన ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. తమిళనాడు ముఖ్యమంత్రి, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీ.ఆర్. పాటిల్ సమక్షంలో వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ వర్చువల్ సంతకాల కార్యక్రమంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.తమిళనాడు వ్యాప్తంగా తాగునీటి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయ డానికి, గృహాలకు సురక్షితమైన, సరిపడా తాగునీటిని నిరంతరాయంగా అందించడానికి ఈ ఒప్పందం ఒక ముఖ్యమైన ముందడుగని అధికారిక ప్రకటన తెలిపింది.

## రాఘవ లారెన్స్ పొలిటికల్ ఎంట్రీ..11న క్లారిటీ



హైదరాబాద్ - సూర్య వాస్తవం
స్టార్ హీరో రాఘవ లారెన్స్ రాజకీయ పోటీపై ఆసక్తికరమైన ప్రచారం జరుగుతోంది. తమిళనాడులోని కీలకమైన 'తిరుచ్చి ఈస్ట్' అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన బరిలోకి దిగబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా, తమిళ స్టార్ హీరో, తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీ అధినేత, సీఎం విజయ్ గతంలో తాను గెలిచిన 'తిరుచ్చి ఈస్ట్' స్థానాన్ని వదులుకున్న నేపథ్యంలో.. ఆ సీటు నుంచి రాఘవ లారెన్స్ పోటీ చేయడం ఖాయమనే ప్రచారం జోరందుకుంది. ఈ ప్రచారానికి ఆయన సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు .తన భవిష్యత్తు కార్యాచరణపై ఈనెల 11వ తేదీన ఒక కీలక ప్రకటన చేయబోతున్నాను. తన అభిమానులు, ప్రజలు అప్పటివరకు వేచి చూడాలని కోరుతున్నాను' అని లారెన్స్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

# నేడు ప్రపంచ మహాసముద్రాల దినోత్సవం

భూమిపై జీవజాల మనుగడకు మహా సముద్రాలు కీలకమైనవి. ప్రపంచ ఆక్సిజన్‌లో సగానికి పైగా సముద్రాల నుంచే లభిస్తుండగా, కోట్లాది మంది ప్రజల జీవనాధారానికి కూడా ఇవే మూలం. సముద్ర కాలుష్యాన్ని నివారించడం, సముద్ర జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడం, భావితరాలకు స్వచ్ఛమైన సముద్రాలను అందించడం లక్ష్యంగా ప్రతి సంవత్సరం జూన్ 8న ప్రపంచ మహాసముద్రాల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. సముద్రాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల నివారణ, పర్యావరణ పరిరక్షణ, సముద్ర సంపద సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ దినోత్సవం ఒక వేదికగా నిలుస్తోంది.

### ప్రపంచాన్ని కుదిపేసిన "వాటర్‌గేట్" వ్యవహారానికి నాంది

ప్రపంచ రాజకీయ చరిత్రలో అతిపెద్ద రాజకీయ కుంభకోణాల్లో ఒకటైన వాటర్‌గేట్ స్కాండల్ 1972 జూన్ 17న వెలుగులోకి వచ్చినప్పటికీ, దానికి దారితీసిన కీలక పరిణామాలు జూన్ నెలలోనే చోటుచేసుకున్నాయి. ఈ వ్యవహారం అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ రాజీనామాకు దారితీసి ప్రపంచ రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. వాషింగ్టన్ డీసీలోని వాటర్‌గేట్ భవన సముదాయంలో ఉన్న డెమోక్రటిక్ పార్టీ కార్యాలయంలో రహస్యంగా చొరబడి సమాచారం సేకరించేందుకు ప్రయత్నించిన వ్యక్తులను పోలీసులు అరెస్టు చేయడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. అనంతరం జరిగిన విచారణలో అధ్యక్షుడు నిక్సన్‌కు చెందిన సన్నిహిత వర్గాల ప్రమేయం ఉన్నట్లు బయటపడింది. ఈ ఘటనపై ప్రముఖ జర్నలిస్టులు బాబ్ వుడ్‌వర్డ్, కార్ల్ బెర్న్‌స్టీన్ చేసిన పరిశోధనాత్మక కథనాలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. పెరుగుతున్న ఒత్తిడి, కాంగ్రెస్ విచారణల నేపథ్యంలో 1974 ఆగస్టు 8న నిక్సన్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. అమెరికా చరిత్రలో రాజీనామా చేసిన తొలి అధ్యక్షుడిగా ఆయన నిలిచారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత, మీడియా స్వేచ్ఛ, అధికార దుర్వినియోగంపై అప్రమత్తత ఎంత ముఖ్యమో వాటర్‌గేట్ ఘటన ప్రపంచానికి చాటి చెప్పిన చారిత్రక సంఘటనగా ఇప్పటికీ గుర్తించబడుతోంది.

### సాహిత్య ప్రపంచంలో విశేషం

నోబెల్ గ్రహీత కవి జెరార్డ్ మాన్లీ హాప్కిన్స్ జ్ఞాపకం
ఆంగ్ల సాహిత్యంలో వినూత్న కవితా శైలికి పేరుగాంచిన




కవి జెరార్డ్ మాన్లీ హాప్కిన్స్ రచనలు ప్రపంచవ్యాప్తంగా సాహిత్యాభిమానులను ప్రభావితం చేశాయి. జూన్ 8న ఆయన సాహిత్య కృషిని స్మరించుకుంటూ పలు సాహిత్య సంస్థలు కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. ఈ నాలుగు అంశాల్లో రాణి గైడిన్‌ల్యూ జయంతి.

### ప్రపంచ సముద్రాల పరిరక్షణకు ఐరాస పిలుపు జూన్ 08కు అంతర్జాతీయ గుర్తింపు

ప్రపంచ మహాసముద్రాల ప్రాముఖ్యతను చాటి చెప్పేందుకు ఐక్యరాజ్యసమితి 2008లో జూన్ 8ను అధికారికంగా ప్రపంచ మహాసముద్రాల దినోత్సవంగా గుర్తించింది. సముద్ర కాలుష్య నియంత్రణ, సముద్ర జీవ వైవిధ్య పరిరక్షణ, వాతావరణ సమతుల్యతలో సముద్రాల పాత్రపై అవగాహన కల్పించడం దీని ప్రధాన లక్ష్యం.

## ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం

### ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టిన చారిత్రక ఘట్టం

తెలుగు రాష్ట్రాల రాజకీయ చరిత్రలో జూన్ 8కు ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్ర విభజన అనంతరం అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త పాలన ప్రారంభమైన రోజు ఇదే. 2014 జూన్ 8న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయడంతో నవ్యాంధ్ర పునర్నిర్మాణానికి అధికారికంగా శ్రీకారం చుట్టబడింది. తెలంగాణ రాష్ట్రం జూన్ 2న ఆవిర్భవించగా, అనంతరం ఆంధ్రప్రదేశ్ కొత్త పరిపాలన, రాజధాని నిర్మాణం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిపాలనా వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ వంటి కీలక కార్యక్రమాలు జూన్ 8 నుంచి వేగం పుంజుకున్నాయి. దీంతో ఈ రోజును ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది.

**విభజన తర్వాత కొత్త ప్రయాణం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం హైదరాబాద్‌ను కోల్పోయిన ఆంధ్రప్రదేశ్ అనేక సవాళ్లను ఎదుర్కొంది. కొత్త రాజధాని నిర్మాణం, ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల్లో కొత్త రాష్ట్రం తన ప్రయాణాన్ని ప్రారంభించింది. తెలంగాణ ఉద్యమ ఫలితంగా ఏర్పడిన



రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ భవిష్యత్తుకు జూన్ నెల అత్యంత కీలకమైనదిగా నిలిచింది. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం కాగా, జూన్ 8 నవ్యాంధ్ర నిర్మాణ యాత్ర ప్రారంభమైన రోజుగా చరిత్రలో నిలిచిపోయింది.

# గుత్తి ఔటర్ రింగ్ రోడ్డు మరిచారా....?

- కళ్ళాలకు పనికొస్తున్న రహదారులు
- రైలు పట్టాల దగ్గర దిష్టిబొమ్మల్లా నాలుగు పిల్లర్లు
- కోట్లు ఖర్చు చేసి... నిరుపయోగంగా ఉంచారు
- ప్రభుత్వాలు మారిన కాంట్రాక్టర్లు మారిన.... మోక్షం లేదు
- మొద్దు నిద్రలో భవనాల శాఖ

అనంతపురం సూర్య వాస్తవం - ప్రత్యేక కథనం :



గుత్తి నగరంలో విపరీతమైన ట్రాఫిక్, నిత్యం చెన్నై నుంచి ముంబై వెళ్లే భారీ వాహనాలతో ట్రాఫిక్ జాం అవుతుంటుంది. గాంధీ సర్కిల్ నుంచి తాడిపత్రి అనంతపురం రోడ్డు అటు కర్నూల్ రోడ్డు భారీ వాహనాలతో ఇరుకైన రోడ్డులో వెళుతుంటాయి. ట్రాఫిక్ సమస్యలకు ముగింపు పలకడానికి 2016 లో ఔటర్ రింగ్ రోడ్డు మొదలయ్యింది. గుంతకల్లు నుంచి వచ్చే వాహనాలు కొజ్జెపల్లి నుంచి బెంగుళూర్ రోడ్డు టోల్ గేట్ మీదుగా తాడిపత్రి రోడ్డులోని ఎంగిలి బండ వరకు ఔటర్ రింగు రోడ్డు ప్రణాళిక రూపొందించారు. ఒకవైపు పది కిలోమీటర్లు సీసీ రోడ్డు నిర్మించారు. రైలు పట్టాల దగ్గర దిష్టిబొమ్మల్లా నాలుగు పిల్లర్లు నేషనల్ హై వే ఇరువైపుల నాలుగు పిల్లర్లు వేసి దశాబ్దం కావొస్తుంది పని జరగక పక్కన పెట్టారు. కోట్లు ఖర్చు చేసి భూమి కోల్పోయిన రైతులకు పారితోషకం ఇచ్చి నిరుపయోగంగా ఉంచారు. ఓవర్ బ్రిడ్జ్ కోసం తోలిన కంకర కృష్ణార్పణం. స్టీలు కంకర ఇసుక సెంట్రింగ్ సామాగ్రి అంత నిరుపయోగంగా పడేశారు. కాపలాదారులు లేరు. ఇంత ఖర్చు చేసి నిరుపయోగంగా ఉంచడం ఎవరికి లాభం. ఒకవైపు పూర్తిగా రోడ్డు నిర్మించి మరోవైపు కనీసం లైనింగ్ కూడా కాకపోవడం దేనికి నిదర్శనం. ప్రభుత్వాలు మారాయి కాంట్రాక్టర్లు మారారు కానీ పనులకు మోక్షం లేదు. గుత్తి నుండి గుంతకల్లుకు, గుత్తి ఔటర్ రింగ్ రోడ్డు మోకాళ్ళ లోతు గుంతలు ఒకవైపు మరోవైపు రహదారులు బాగుపడవని దృఢ నిశ్చయంతో చుట్టుపక్క గ్రామాల ప్రజలు దళారులు వాటిని నూర్పిడికి, పంట ఒడుపుకోవడానికి, ఆరబెట్టుకోవడానికి, జల్లెడ పట్టుకోవడానికి వాడుతున్నారు. ఇల్లు ఇరకాటంగా మారింది, పశువులు లేవు కాబట్టి పెద్ద పెద్ద గడ్డి వాములు లేవు, ఉన్న స్థలం విపరీతంగా ధర పలుకుతుంది. పంట కోతకు వచ్చిన తరువాత సంసారం అంతా రోడ్డు మీదే. అక్టోబర్ లో ఆముదం, నవంబర్ లో మిర్చీ, డిసెంబర్ లో మొక్కజొన్న, జనవరి ఫిబ్రవరి లో కంది. రాత్రి పూట రోడ్లోనే పడుకుంటున్నారు. వాహనాలు ఒకవైపు వెళ్లాల్సిందే. పంట వ్యర్థాలు తౌడు, ఈనెలు, కొయ్యలు, కంకులు అలాగే వదిలేసి వెళుతున్నారు. దారిన పోయే పోకిరీలు నిప్పంటిస్తుంటారు. కిలోమీటర్లు అగ్నికి ఆహుతవుతుంటుంది. పొదలతో పాటు పచ్చని చెట్లు అగ్నికి దహన మవుతున్నాయి. వాహనాలు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సిందే. గత సంవత్సరం వేసిన రోడ్లు పూర్తిగా నాసిరకంగా ఉండటంతో నడుములోతు గుంతలు దరసనమిస్తున్నాయి. విపరీతమైన రద్దీ మూలంగా పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణికులను తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. రైల్వేస్టేషన్, టమోటా మార్కెట్, చెట్నేపల్లి, సూర్సింగపల్లి వరకు ఇల్లు విస్తరించడం అలాగే విద్యాలయాలు ఎక్కువగా ఉండటంతో పత్తికొండ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటున్నది. గత ఎనిమిది సంవత్సరాలుగా రజాపురం బ్రిడ్జి నిర్మాణం పూర్తికాలేదు. మార్నపల్లి, పెద్దొడ్డి రోడ్డు కోతకు గురైనది. కొంగనపల్లి, వైటీ చెరువు రోడ్డు అధ్వానంగా ఉంది. పల్లెలకు వెళ్లే మార్గాలు నరకప్రాయంగా మారాయి. మాముడూరు అబ్బేదొడ్డి, తురకపల్లి న్యమతాబాదు, అణగనదొడ్డి, పి ఎర్రగుడి, గురబ్బాడు, నాగసముద్రం దార్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. జిల్లాలోని పలు ప్రధాన రహదారులు, స్టేట్ హైవే, గ్రామీణ రహదారులు అధ్వాన్నంగా మారటంతో వాహనాల్లో ప్రయాణం ప్రమాద కరంగా మారటంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. వీరితో పాటు వాహన యజమానులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మిడుతూరు పెద్దవడుగూరు, కిష్టిపాడు, చిత్రచేడు, మొలకతాళ్ళ గ్రామీణ ప్రాంత రోడ్లు దుర్భరంగా తయారయ్యాయి. రోజు ఎక్కడో ఒకచోట ఈ రహదారిపై ప్రమాదం జరుగుతున్నా ప్రభుత్వానికి అధికారులకు చీమ కుట్టినట్టు లేదు. రోడ్లపై నెలల తరబడి కాపురాలు ఉంటున్నా రహదారి భవనాల శాఖ వారు మొద్దు నిద్రలో జోగుతున్నారు. ప్రధాన రహదారులలో అగ్నికి ఆహుతవుతున్న, ట్రాఫిక్ ఐలాండ్స్ లో పచ్చని గడ్డి, క్రోటన్స్, గన్నేరు, కాగితం పూల చెట్లు మసి బొగ్గులు తయారవుతున్న చోద్యం చూస్తున్నారు. చెట్లకు నిప్పు ప్రమాదకరం అని భావించాలి, పంట వ్యర్థాలను ప్రభుత్వం రైతుల సహకారం తో సేంద్రియ ఎరువుగా మార్చడానికి ముందుకు రావాలని వ్యర్థం కదా అని కాలిస్తే అనర్థం అని రైతులు గ్రహించాలని డా. ముచ్చుకోట సురేష్ బాబు, అధ్యక్షులు, నిర్వాసితుల సంక్షేమ సంఘం, పౌర స్పందన వేదిక అధ్యక్షులు ప్రొ జి . వెంకటశివారెడ్డి కోరారు.





## గతంలో వైసిపి కోసం చేసారు..

**- ఇప్పుడు మా కోసం చేయాల్సిందే: జేసీ ప్రభాకర్ రెడ్డి**



**తాడిపత్రి - సూర్య వాస్తవం :** గత వైసిపి ప్రభుత్వ హయాంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ అప్పటి పోలీస్ అధికారులు, వైసిపి నాయకులపై సంచలన ఆరోపణలు చేశారు. పోలీసుల అండతోనే బలవంతపు ఏకగ్రీవాలు గత ప్రభుత్వ కాలంలో తెలుగుదేశం పార్టీ నాయకులను, కార్యకర్తలను పోలీసులు తీవ్రంగా వేధించారని జేసీ ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. కనీసం ఎన్నికల్లో నామినేషన్లు వేసి, పోటీ చేసే అవకాశం కూడా ఇవ్వకుండా అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. పై అధికారుల నుంచి వచ్చిన స్పష్టమైన ఆదేశాలతోనే పోలీసులు రిగ్గింగ్‌కు సహకరించి, బలవంతంగా ఏకగ్రీవాలు చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు మా కోసం చేయాల్సిందే! ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో జరగబోయే ఎన్నికలను ప్రస్తావిస్తూ ఆయన పోలీసులకు ఒక సవాల్ విసిరారు. అప్పట్లో వైసిపి కోసం రిగ్గింగ్ చేసి, బలవంతపు ఏకగ్రీవాలు చేసిన అదే పోలీస్ అధికారులు ఇప్పుడు మా ప్రభుత్వ హయాంలో జరిగే ఎన్నికల్లో మా కోసం కూడా ఏకగ్రీవాలు చేయాల్సిందే అంటూ ఆయన వ్యాఖ్యానించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**నాపై 92 కేసులు పెట్టారు.**

ప్రజా సమస్యలపై, అక్రమాలపై గట్టిగా నిలదీసి మాట్లాడినందుకు గాను గత ప్రభుత్వం తనపై కక్షసాధింపు చర్యలకు పాల్పడిందని జేసీ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం గొంతు నొక్కేందుకే తనపై ఏకంగా 92 అక్రమ కేసులు బనాయించారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ?జేసీ ప్రభాకర్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లా రాజకీయాల్లోనే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ యంత్రాంగంలో పెద్ద సంచలనంగా మారి అవకాశం ఉంది.

## నూతన చర్చిని ప్రారంభించిన ఎంపీ అవినాష్ రెడ్డి



**తొండూరు - సూర్య వాస్తవం:** తొండూరు మండల పరిధిలోని ఇనగలూరు గ్రామంలో నూతనం గా నిర్మించిన టీసీసీ చర్చిని ఆదివారం కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రారంభించారు. వాటిలో భాగంగా ఎంపీ అవినాష్ రెడ్డి ఇనగలూరు గ్రామంలో చేరుకోగా గ్రామంలోకి స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు డప్పుల వాయిద్యాలు, బాణసంచా, పూలమాలలు శాలువాలతో ఎంపీ అవినాష్ రెడ్డికి ఘనంగా ఆహ్వానం పలికారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్లు ఎంపీ అవినాష్ రెడ్డి పేరున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామస్తులతో ఆత్మీయంగా మాట్లాడిన ఎంపీ, అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ భూమిరెడ్డి రవీంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శశికాంత్ రెడ్డి, అధికార ప్రతినిధి యాడికి దశరథ రామిరెడ్డి, అంకిరెడ్డి సురేష్ రెడ్డి, యువజన విభాగ కార్యనిర్వక సభ్యుడు యస్ లక్ష్మి రెడ్డి తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళల రక్షణే ధ్యేయం

**- తాడిపత్రిలో ప్రత్యేక అవగాహన సదస్సు!**

**తాడిపత్రి- సూర్య వాస్తవం :** మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు, తాడిపత్రి పట్టణంలోని కాలవగడ్డ ప్రాంతంలో మహిళల రక్షణే ధ్యేయంగా ఒక ప్రత్యేక అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు.

**అధికారుల ఆధ్వర్యంలో అవగాహన:**

తాడిపత్రి అర్బన్ సి. ఐ ఆరోహణరావు, ఎస్. ఐ గౌస్ ల ఆధ్వర్యంలో స్థానిక మహిళలతో ఈ సమావేశం జరిగింది. ఈసందర్భంగా అధికారులు మహిళా భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలపై మాట్లాడారు.

**శక్తి యాప్ -- అత్యవసర ఆపద్బాంధవి:**

విపత్కర, అత్యవసర పరిస్థితుల్లో మహిళలు తమను తాము ఎలా రక్షించుకోవాలో ఈ సదస్సులో ప్రాక్టికల్‌గా వివరించారు.మహిళల మొబైల్‌లో శక్తి యాప్ ఉండటం ఎంతో అవసరమని, ప్రమాద సమయంలో అందులోని ఎస్ఓఎస్ బటన్ నొక్కితే చాలని అధికారులు తెలిపారు. తక్షణ పోలీస్ సహాయం: బటన్ నొక్కిన వెంటనే సమాచారం కంట్రోల్ రూమ్‌కు చేరి, క్షణాల వ్యవధిలో పోలీస్ సహాయం ఘటనా స్థలానికి చేరుకుంటుందని మహిళలకు భరోసా ఇచ్చారు. ఈ సదస్సు లో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, యాప్ పనితీరుపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పోలీస్ శాఖ తీసుకుంటున్న ఈ చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి

**- 9న భారీ రాస్తారోకోకు వామపక్షాల పిలుపు**



**.గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం గాంధీ సర్కిల్ ఆర్ఎంపీ బంగ్లాలో సిపిఎం, సిపిఐ వామపక్షాల ఆధ్వర్యంలో ప్రెస్మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శివి నిర్మల, సిపిఐ మండల కార్యదర్శి రామదాసు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా పెం చిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని ఈ నెల 9వ తారీకు పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహిస్తున్నా మని తెలిపారు.ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు అవలంబిస్తున్న తీరుపై మం డి పడ్డారు ఇప్పటికే పేద ప్రజల పైన గత మూడు నెలల నుంచి పెట్రోల్ డీ జిల్ గ్యాస్ ధరలను పెంచుతూ ప్రజ లపై భారాలు వేస్తున్నారని ఇప్పటి కైనా కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించకపోతే రాబోవు ది నాల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు పో రాటాలు నిర్వహిస్తామని డిమాండ్ చేశారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు పెట్రోల్ డీజిల్ ఆ దా చేయాలని అంటున్నారు ఆయ న పర్యటన చేస్తున్న ప్రదేశాలకు రావడానికి పెద్ద ఎత్తున అధికారులు కార్యకర్తలు ప్రజలు రావడానికి ఎం త పెట్రోల్ డీజిల్ ఖర్చవుతుంది అ న్నది ఆయన తెలుసుకోవాలి మరి పేదలు బండ్లు ఆటోలు వేసుకొని ఎ క్కడికి వెళ్తారు వాళ్ళు బ్రతుకు కో సం వెళతారు మరి అలాంటి బ్రతు కుతెరువు కోసం వెళున్నప్పుడు పె ట్రోల్ డీజిల్ ఆదా చేయాలి అని అ నడం ఎంత మటుకు కరెక్టు కనుక ఇ ప్పటికైనా పేద ప్రజల పైన భారాలు వేయడాన్ని ఉపసంహరించుకోవాల ని పెంచిన పెట్రోల్ డీజిల్ తగ్గించాల ని హెచ్చరించారు తొమ్మిదవ తారీకు రాస్తారోకోని ప్రజా సంఘాలు ఆటో కార్మికులు పేద ప్రజలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం మండల కార్యదర్శి నిర్మల, సిపిఐ మండల కార్యదర్శి రామదాసు, సిపిఎం మండల కమిటీ సభ్యులు రామకృష్ణ, రేణుక, రామేశ్వరి,సిపిఐ పట్టణ కమిటీ సభ్యులు న జీర్,పట్టణ సహాయ కార్యదర్శి నరసింహా షఫీ వేణుగోపాల్ సిపిఎం కార్యకర్తలు వన్నూరమ్మ, వంశీ, రెడ్డమ్మ, వెంకటమ్మ, మరియమ్మ శీన, తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

**- గ్యాస్‌లో 50 శాతం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలి**
**- జూన్ 9న జరిగే రాస్తారోకోను జయప్రదం చేయండి**
**- సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్ పిలుపు**



**డోన్ -సూర్య వాస్తవం:** ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను నిరంతరం పెంచుతూ ప్రజలపై భరించలేని ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్ తీవ్రంగా విమర్శించారు. ధరల పెరుగుదలతో సామాన్యులు, కార్మికులు, రైతులు, చిన్న వ్యాపారులు, ఉద్యోగులు, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టిన సందర్భాల్లో కూడా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఉపశమనం కల్పించకుండా ఎక్సైజ్ సుంకాలు, సెస్సులు, ఇతర పన్నుల రూపంలో భారీగా ఆదాయం సమీకరిస్తోందని ఆరోపించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యాట్ రూపంలో అధిక పన్నులు విధించడం వల్ల ఇంధన ధరలు మరింత పెరుగుతున్నాయని పేర్కొన్నారు.పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల ప్రభావం రవాణా రంగంపై తీవ్రంగా పడుతుండటంతో కూరగాయలు, నిత్యావసర వస్తువులు, నిర్మాణ సామగ్రి, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. ఫలితంగా ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయి కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని చెప్పారు.

అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలోని కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్ దేశంలోనే అత్యంత విలువైన చమురు, సహజవాయువు నిక్షేపాలకు కేంద్రంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజలకు తగిన ప్రయోజనం అందడం లేదని అన్నారు. రాష్ట్ర భూభాగం, తీర ప్రాంత వనరులను వినియోగించి ఉత్పత్తి చేస్తున్న చమురు, గ్యాస్‌లో కనీసం 50 శాతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవసరాలకు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే సహజవాయువును పరిశ్రమలకు, విద్యుత్ ఉత్పత్తికి, గృహ వినియోగానికి అందుబాటులో ఉంచితే అభివృద్ధికి దోహదపడటమే కాకుండా ప్రజలపై ఇంధన భారం కూడా తగ్గుతుందని తెలిపారు. రాష్ట్ర సంపదపై రాష్ట్ర ప్రజలకు మొదటి హక్కు ఉండాలని సీపీఎం స్పష్టం చేస్తోందన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడటం సీపీఎం బాధ్యతగా భావిస్తోందని పేర్కొన్న ఆయన, పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా ప్రజల గొంతుకగా ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో జూన్ 9న సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాస్తారోకో కార్యక్రమాన్ని ప్రజలు, కార్మికులు, రైతులు, యువజనులు, మహిళలు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పట్టణ కమిటీ సభ్యులు షేమిమ్ బేగం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలలో వైసీపీ నాయకులు

**- నూతన వధూవరులను ఆశీర్వదించిన వైసీపీ శ్రేణులు**



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని జండా మాన్ వీధి ఉన్న వైయస్సార్ కుటుంబ స్నేహితుడు శ్రేయోభిలాషి ఖాదరవల్లి మనవడు, షేక్ ఇబ్రహీం కుమారుడు, షేక్ కాజా వివాహ వేడుకలు కాజీపేటలో ఘనంగా జరిగాయి ఈ వివాహ వేడుకలకు ముఖ్య అతిథులుగా మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజుల్లా, వైసిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లా, మాజీ కౌన్సిలర్ రాజశేఖర్ రెడ్డి,ఖుద్దుష్, లు హాజరై అల్లా దీవెనతో నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వచనాలు అందించారు. అనంతరం పలువురు ఆప్యాయంగా పలకరించగా వివాహ వేడుకల సందడి వాతావరణం లో గడిపారు. ఈ కార్యక్రమంలో వివాహ బంధుమిత్రులు వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం 20వ వార్డులో డోర్ టు డోర్ వెరిఫికేషన్

**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని 20వ వార్డులో ఆదివారం సర్ డోర్ టు డోర్ ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు నర్సారెడ్డి వీరారెడ్డిలు మాట్లాడుతూ ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంత మైందని, ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదేనని, ఎన్నికల సంఘం ప్రతి అర్హులైన పౌరునికి ఓటర్ నమోదు చేయడమే లక్ష్యంగా డోర్ టు డోర్ వెరిఫికేషన్ చేయడం జరుగుతుందని, ఈ ప్రక్రియ ద్వారా ఓటర్ జాబితాలో తప్పులను సరిదిద్దడం మరణించిన వారిని పేర్లు తొలగించడం, కొత్త ఓటర్లను చేర్చడం వంటి వెరిఫికేషన్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్జున్ రెడ్డి, విజయ్ కుమార్,ప్రదీప్ రెడ్డి,రాజు కుళ్లాయప్ప రీహనా,షేక్ హాజీరా పాల్గొన్నారు.



## అంకాలమ్మ తల్లికి విశేష పూజలు

**- ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అంకాలమ్మ తల్లి**



**పులివెందుల అర్బన్ - సూర్య వాస్తవం :** పులివెందల పట్టణం పార్నపల్లి రోడ్డు సమీపంలో నడిబొడ్డున కొలువై ఉన్న అంకాలమ్మ తల్లికి ఆదివారం పర్వదినాన ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయాస్తమాన అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన, తదితర పూజా కైకర్యాల అనంతరం పట్టు వస్త్రాలతో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు అందుకొని మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని, ప్రతి ఆదివారం ఆలయానికి వస్తున్నటువంటి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేస్తూ జాగ్రత్తలు వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు ఎండోమెంట్ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అనీ రాజాపై ఆర్ఎస్ఎస్ దాడి దుర్మార్గపు చర్య

**- ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.సురేంద్ర కుమార్**



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆక్రోష్ జనతా పార్టీ పిలుపు మేరకు శనివారం జరిగిన నిరసనకు సంఘీ భావం తెలిపేందుకు వెళ్లిన సిపిఐ జాతీయ కార్యదర్శి అనీ రాజా పై ఆర్ఎస్ఎస్ మూకలు దాడి చేయడాన్ని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐ. ఏ. ఎల్ )రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి సురేంద్ర కుమార్ దుర్మాపు చర్యగా అభివర్ణించారు. ఆదివారం అయన పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి అనీ రాజా పై అలాగే ఎన్ ఎఫ్ ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి నిషా సిద్దు తో పాటు ఏఐవైఎఫ్ ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలపై ఆర్ఎస్ఎస్ మూకలు దాడి చేయడం చాలా దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది పనికిరాదన్నారు. దాడికి పాల్పడ్డ ఆర్ఎస్ఎస్ మూకలపై నాన్ - బైలాబుల్ కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని సురేంద్ర కుమార్ డిమాండ్ చేశారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

## - సీపీఐ, సీపీఎం



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :** వామపక్ష పార్టీలు సిపిఐ -సిపిఎం ఆధ్వర్యంలో పెంచిన పెట్రోల్ డీజిల్ తగ్గించాలని 09-06-2026న జరిగే రాష్ట్ర వ్యాప్త రాస్తారోకోలను జయప్రదం చేయాలని ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం పత్తికొండ సిపిఐ మండల కార్యదర్శి యు.కారుమంచి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి పూర్వపు సిపిఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శి పి భీములింగప్ప సిపిఎం సీనియర్ నాయకులు రంగారెడ్డి . సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబి రసూల్ రాజా సాహెబ్ గారు లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను పెంచడం వల్ల ప్రజలపై రోజురోజుకు పెరుగుతున్న ఆర్థిక భారం పెనుబారం అవుతుంది. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించకుండ ధరలు పెంచి ప్రజలను దోచుకోవడం అన్యాయమన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల కారణంగా రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు కూడా అధికమవుతాయని విమర్శించారు. వంట గ్యాస్ ధరల పెరుగుదల వల్ల మధ్యతరగతి, పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. గతంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గిస్తామని, ప్రజలపై భారాన్ని తగ్గిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఎన్నికల సమయంలో ఒకలా మాట్లాడి, ఎన్నికలు పూర్తయిన తర్వాత ఇంధన ధరలను రోజురోజుకి పెంచుతూ ప్రజలపై మరింత భారం మోపుతున్నాడని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ధరల పెంపులతో సామాన్య ప్రజల జీవనాన్ని మరింత కష్టతరం చేశారని ఆరోపించారు. ప్రధానమంత్రి మరియు కేంద్ర మంత్రులు ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని వారు విమర్శించారు. ధరల పెరుగుదలపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తికి సమాధానం చెప్పాలని ప్రధానమంత్రి, సంబంధిత కేంద్ర మంత్రులను ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం ఎందుకు విఫలమైందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. పెంచిన ఇంధన ధరలను తగ్గించి, వంట గ్యాస్‌ను అందుబాటు ధరలో అందించాలని ఈ నెల 09-06-2026న జరిగే రాస్తారోకో కార్యక్రమంలోరైతులు, కార్మికులు, సామాన్య ప్రజలు పార్టీలకతీతంగా అధిక సంఖ్యలో పాల్గొని రాస్తారోకోను జయప్రదం చేయాలని తెలియజేశారు. ఈ సమావేశంలో దళితక్కులపోరాటసమితి. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ గురుదాస్ సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు సురేంద్ర కుమార్ పెద్ద వీరన్న నెట్టకంటయ్య సిపిఎం నాయకులు దస్తగిరి ఎఐటియుసి తాలూకా కార్యదర్శి రంగన్న సిఐటియు మండల కార్యదర్శి రవిచంద్ర ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సిద్దు రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి కారప్ప ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొనడం జరిగింది.

## గుణకనపల్లెకు కృష్ణాజలాలు రావడం సంతోషకరం

### - కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



**లింగాల - సూర్య వాస్తవం :** గునకనపల్లి గ్రామానికి కృష్ణాజలాలు రావడం సంతోషకరమని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. చెరువు కట్ట వద్ద ఏర్పాటుచేసిన 5బోరు బావులకు కృష్ణా జలాలతో నీటి రీఛార్జి కార్యక్రమంలో కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఆదివారం ఉదయం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఇటువంటి బృహత్తర కార్యక్రమం ఎక్కడ జరగలేదన్నారు. ఎక్కడైనా చెరువులలో నీరు నింపి సమీప ప్రాంతాల భూగర్భ జలాలు పెరిగే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వేసవికాలం వస్తే గుణకనపల్లి గ్రామంలో సాగు, త్రాగు నీటి సమస్యతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండేవా రన్నారు. ఈవిషయం తన దృష్టికి వచ్చినప్పుడు ఈ గ్రామాకి భవిష్యత్తులో నీటి ఎద్దడి కలగకుండా ఉండేందుకు తన వంతు సహకారంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో లింగాల కుడికాలు నుంచి గుణకనపల్లి చెరువుకు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు నింపి నట్లయితే గ్రామములో ఎప్పటికీ నీటి సమస్య ఉండదని, ఈఆలోచనతోనే సుమారు 5 కోట్ల రూపాయలు వెచ్చించి లింగాల కుడికాలువపై గుణకనపల్లి ఎత్తిపోతల పథకం చేపట్టామన్నారు. ఇలా బోర్లు వేసి అందులోకి నీటిని పంపించి భూగర్భ జలాలు పెంపొందించడం దేశంలో ఎక్కడా జరగలేదన్నారు. కార్యక్రమంలో శిలాఫలకాన్ని కూడా ఎంపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైకాపా నాయకులు శేఖర్ రెడ్డి, మునేశ్వర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి తో పాటు మండల పరిధిలోని వైకాపా నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## భారీగా అక్రమ రేషన్ బియ్యం స్వాధీనం!

**తాడిపత్రి - సూర్య వాస్తవం:** పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న అక్రమార్కులపై అధికారులు ఉక్కుపాదం మోపారు. తాడిపత్రి మండలంలో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ రేషన్ బియ్యం నిల్వలను పోలీసులు, సివిల్ సప్లై అధికారులు సంయుక్తంగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు.



**అధికారుల మెరుపు సోదాలు**

అందిన నమ్మకమైన సమాచారంతో తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి, సివిల్ సప్లై తహశీల్దార్ మల్లేష్ ప్రసాద్ తమ సిబ్బందితో కలిసి మండలంలోని ఒక నిల్వ కేంద్రంపై మెరుపు సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన 60 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని అధికారులు తక్షణమే సీజ్ చేశారు. అనంతరం ఈ భారీ నిల్వలను భద్రత నిమిత్తం గుంతకల్లులోని ప్రభుత్వ గోడౌన్‌కు తరలించారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచిన నిందితులపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. పేదల బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

## ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవంపై అవగాహన



**కడప-సూర్య వాస్తవం:** ఆహార భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప జిల్లా హోటల్స్ అసోసియేషన్, కిరాణా అసోసియేషన్, లీగల్ మెట్రాలజీ శాఖ (తూనికలు, కొలతల శాఖ) మరియు ఫుడ్ సేఫ్టీ శాఖ సంయుక్తంగా శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ హారిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆహార భద్రత, నాణ్యమైన ఆహార పదార్థాల వినియోగం, వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణ, ఆహార వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆహార వ్యాపారులు నిబంధనలు పాటిస్తూ వినియోగదారులకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూనికలు, కొలతల శాఖ సీఐ ఎం. రమేష్ రెడ్డి పాల్గొని వ్యాపార లావాదేవీల్లో సరైన తూనికలు, కొలతలు ఉపయోగించడం ద్వారా వినియోగదారుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో =ఖజూ (రిపర్పస్ యూజ్డ్ కుకింగ్ ఆయిల్) ప్రాజెక్ట్‌కు అధీకృత అగ్రిగేటర్‌గా ఉన్న గ్నాపిక ఎంటర్‌ప్రైజెస్ తరఫున పాల్గొన్న అల్లూరి సంపత్ కుమార్ మాట్లాడుతూ, వాడిన వంట నూనెను తిరిగి ఆహార తయారీలో ఉపయోగించకుండా అధీకృత సంస్థలకు అందించాలని సూచించారు. ఆ నూనెను బయోడీజిల్ తయారీకి వినియోగించడం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ సంరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని తెలిపారు. ఆహార భద్రత, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె ప్రవీణ్, హోటల్స్ అసోసియేషన్, కిరాణా అసోసియేషన్ ప్రతినిధులు, వ్యాపారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## రామాలయంలో చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు

**చెన్నూరు- సూర్య వాస్తవం :** లోరిష బృంద నాట్య కళామందిరం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ రామాలయం ప్రాంగణంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా చిన్నారులు ఆకట్టుకునే కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, "అడుగుల్లో లయ… అభినయంలో భావం…అదే కూచిపూడి నృత్య వైభవం" అని పేర్కొన్నారు. కూచిపూడి నృత్యం కేవలం కళ మాత్రమే కాకుండా భావాలను వ్యక్తపరిచే దివ్య సాధనమని, కళలను ప్రోత్సహించడం ద్వారా మన సంస్కృతిని భావితరాలకు అందించవచ్చని తెలిపారు. లోరిష బృంద నాట్య కళామందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకున్నారు. కళకు వయసుతో సంబంధం లేదని, ప్రతిభకు గుర్తింపు లభించడమే గొప్ప విజయమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కళాకారులను ప్రోత్సహిస్తూ కళా వికాసానికి విశేష కృషి చేస్తున్న శ్రీమతి ఏ. వీరలక్ష్మిని అభినందించారు. ఆమె మాట్లాడుతూ, "కళను ఆదరించే చేతులు ఉన్నంత కాలం సంస్కృతి సజీవంగా ఉంటుంది" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, భక్తులు, కళాభిమానులు పాల్గొని చిన్నారుల ప్రదర్శనలను అభినందించారు.



## అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

### - ముఖ్యమంత్రికి వినతి అందించిన టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి



**వేముల - సూర్య వాస్తవం:** విజయవాడలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ని టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పులి వెందుల ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, అభివృద్ధి అవసరాలపై ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. పులివెందుల ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని పార్థసారథి రెడ్డి కోరారు.లి ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాలను విజయవంతం చేయండి

### - చంద్రబాబు ఇచ్చిన కూటమి హామీలపై ఫోటో ఎగ్జిబిషన్
### - పట్టణ వైసీపీ కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి

**పులివెందుల - సూర్య వాస్తవం :** వైకాపా నాయకులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "వెన్నుపోటుకు రెండేళ్ళు" కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించే నిరసన కార్యక్రమాలకు కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పులివెందుల పట్టణ వైకాపా కన్వీనర్ గంగాధర్ రెడ్డి పిలుపునిచ్చారు.



కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మేనిఫెస్టో,సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా, అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచిన వైనంపైన మరియు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ మన పార్టీ కేడర్ లో పని చేస్తున్నవారందరి సమక్షం లో సోమవారం ఉదయం 9:00 గంటలకి పులివెందుల లోని వైయస్సార్ ఆడిటోరియం నందు నల్లబెలూన్ లతో నిరసన తెలిపే కార్యక్రమం మరియు చంద్రబాబు ఇచ్చిన బూటకపు హామీల పై ఫోటో ఎగ్జిబిషన్, వీడియో ప్రదర్శన అనంతరం వక్తల ఉపన్యాస సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని అదేవిధంగా 12వ తేదీ శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించు నిరసన కార్యక్రమాలను విజయవంతం చేసి కూటం ప్రభుత్వ విధానాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలని పిలుపునిచ్చారు.


## పందుల దొంగలు అరెస్టు

### - రూ.30.65 లక్షల విలువ గల సొత్తు చోరీ
### - 10 లక్షల విలువ గల నగదు స్వాధీనం

**పులివెందుల - సూర్య వాస్తవం:** పందులు దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.30.65 విలువ గల చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు పులివెందుల అర్బన్ సీఐ శ్రీరామ్ తెలిపారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల, వేంపల్లి, పెండ్లిమర్రి పోలీస్ స్టేషన్‌లలో నమోదైన ఐదు కేసులకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపట్టామన్నారు. దొంగలు పట్టణంలో తిరుగుతున్నారని సమాచారం రావడంతో శనివారం ఎస్సైలు మధుసూదన్ రెడ్డి, తిమోతి, పోలీస్ సిబ్బందితో కలిసి పట్టణంలోని కోతి సమాధి వద్ద 6 మందిని అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి 95 పందులు, రూ. 10 లక్షల నగదు, ఒక బుల్లెట్ మోటార్ వెహికల్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు వీటితోపాటు జినాన్ పిక్ అఫ్ వాహనమును సీజ్ చేశామని తెలిపారు. ముద్దాయిలు దొంగతనాలు చేసే క్రమంలో అడ్డు వచ్చిన వారిపై పెప్సీ బాటిల్ , చన్న, చిన్న రాళ్లతో దాడులు చేస్తారని, అడ్డు వచ్చినా వాహనాలను కూడా గుద్దడం జరిగిందన్నారు. ఈ దొంగతనాలు చేసే క్రమంలో నాలుగు వాహనాలను గుద్దడం జరిగిందన్నారు. 6 మంది కాకుండా మరో ఇద్దరు పరారీలో ఉన్నారని వారిని త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని రిమాండ్ కు పంపడం జరుగుతుందన్నారు . ఈ కేసును చేదించిన పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, పులివెందుల డిఎస్పి మురళి నాయక్ అభినందనలు తెలిపారు.



# రెండవసారి ఆదోని కురువ సంఘం మండల అధ్యక్షులుగా చాగి మల్లికార్జున రెడ్డి ఎన్నిక





**ఆదోని - సూర్య వాస్తవం :** ఆదోని పట్టణం కురువ కులస్తుల ఆరాధ్య దైవం అయినటువంటి శ్రీ భీరలింగేశ్వర దేవస్థాన కళ్యాణమండపం నందు ఆదోని మండలం ఆయా గ్రామాల నుంచి, మరియు పట్టణం నలుమూలల నుంచి వచ్చినటువంటి కురువ కులస్తుల, సమక్షంలో, రాష్ట్ర కురవ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఎస్ కే.మల్లికార్జున రాష్ట్ర జిల్లా కార్యవర్గ సభ్యుల సమక్షంలో రెండోసారి ఆదోని కురువ సంఘం మండల అధ్యక్షులుగా చాగి.కురవ మల్లికార్జున రెడ్డి,గారిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.తదానంతరం రాష్ట్ర అధ్యక్షులు, పూర్వ కార్పొరేషన్ చైర్ పర్సన్, నియామక పత్రాన్ని అందజేస్తూ రెండోసారి మండల అధ్యక్షులుగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. నన్ను రెండోసారి మండల అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర కార్యవర్గానికి అలానే జిల్లా కార్యవర్గానికి ముఖ్యంగా కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్పకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కుల సంఘాల్లో పదవులు అలంకారం కాదని సమాజానికి తన వంతు సేవ చేసే భాగ్యమని చాగి.మలికార్జునరెడ్డి అన్నారు. నాపై నమ్మకం నుంచి రెండోసారి కురువ సంఘం మండల అధ్యక్షులుగా ఎన్నుకున్నటువంటి మా రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు నాయకుల నాపై ఉంచినటువంటి నమ్మకాన్ని వమ్ము చేయనని చాగి.మల్లికార్జున రెడ్డి అన్నారు. అలానే నూతనంగా ఆదోని నియోజకవర్గం అధ్యక్షులు కురువ రాఘవేంద్రను నియమించడం జరిగింది. జిల్లా కురువ సంఘం అధ్యక్షులుగా కురువ మల్లికార్జున వెంకన్నపేట వారిని నియమించి నియామక పత్రాలను అందజేయడం జరిగింది. క్రమంలో రాష్ట్ర జిల్లా కురవ సంఘాల నాయకులు కర్నూలు జిల్లా నలుమూల నుంచి వచ్చినటువంటి మండలాల గ్రామాల కురవ సంఘం పెద్దలు నాయకులు అందరూ పాల్గొన్నారు.

# పత్తి రైతుకు అండగా నిలిచిన బొమ్మనహాళ్ పోలీసులు

- పత్తి దొంగతనం కేసును 2 రోజుల్లోనే ఛేదింపు...
- నలుగురు నిందితులు అరెస్ట్..
- రూ.44,000 నగదు, టాటా ఏస్ వాహనం స్వాధీనం




**రాయదుర్గం - సూర్య వాస్తవం :** బొమ్మనహాళ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పత్తి దొంగతనం కేసును పోలీసులు అత్యంత చాకచక్యంగా వ్యవహరించి కేవలం రెండు రోజుల్లోనే ఛేదించారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి దొంగిలించిన పత్తిని విక్ర యించిన నగదు, నేరానికి ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.


**రైతు రక్షణే పోలీసుల ప్రధాన కర్తవ్యం :**
?రైతు చెమటోడ్చి పండించిన పంట కేవలం ఒక వస్తువు కాదు.. అది ఆ కుటుంబ జీవనాధారం. అన్నదాత కష్టాన్ని దోచుకునే ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, బాధితుడు రైతు అయినప్పుడు పోలీసు శాఖ మరింత అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా స్పందిస్తుందని పోలీసులు నిరూపించారు. కేవలం 48 గంటల్లోనే దొంగలను పట్టుకుని రికవరీ చేయడం రైతుల పట్ల పోలీసు యంత్రాంగానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం.

**కేసు వివరాలు :** బొమ్మనహాళ్ మండలం, ఉంతకల్లు గ్రామానికి చెందిన రైతు బలిజ హనుమంతరాయ (43) తన వ్యవసాయ పొలంలో నిల్వ ఉంచిన సుమారు 05 క్వింటాళ్ల పత్తిని (విలువ సుమారు రూ.50,000) గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు బొమ్మనహాళ్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 47/2026, ఖ/ం 303(2) దీచీూ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**నిందితుల అరెస్ట్ మరియు రికవరీ:**
ఈ కేసు దర్యాప్తులో భాగంగా 06.06.2026 సాయంత్రం 04.00 గంటలకు నేమకల్లు క్రాస్ వద్ద రాయదుర్గం రూరల్ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, బొమ్మనహాల్ సబ్ ఇన్స్పెక్టర్ బి. నబీ రసూల్ గారి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా వారు నేరాన్ని అంగీకరించారు. ఓస్వాధీనం చేసుకున్న సొత్తులి : నిందితులు దొంగిలించిన పత్తిని విక్రయించగా వచ్చిన రూ.44,000 నగదుతో పాటు, నేరానికి ఉపయోగించిన ఒక టాటా ఏస్ వాహనాన్ని పోలీసులు రికవరీ చేశారు.

**విధి నిర్వహణలో పరమార్థం - ఉన్నతాధికారుల అభినందనలు:**
అన్నదాత కష్టం వృథా పోకుండా, త్వరితగతిన స్పందించి రికవరీ చేసి రైతుకు అందించడం విధి నిర్వహణలో తమకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని ఇచ్చిందని ఈ సందర్భంగా పోలీసులు తెలియజేశారు. నిరంతరం ప్రజల రక్షణలో ఉండే పోలీసులకు.. అన్నదాత కళ్ళలో ఆనందం చూడటాన్ని మించిన గౌరవం మరొకటి లేదని పేర్కొన్నారు. ఈ కేసును రికార్డు సమయంలో ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన రాయదుర్గం రూరల్ ఇన్స్పెక్టర్, బొమ్మనహాల్ ఎస్సైలు మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఐపీయస్ ప్రత్యేకంగా అభినందించారు.

# విద్యుత్ అంతరాయం -- ముందస్తు సమాచారం



**వేంపల్లె - సూర్య వాస్తవం:** వేంపల్లె --పులివెందుల రోడ్డులో ఉన్న 11 కె.వి విద్యుత్ లైన్‌కు అత్యవసర నిర్వహణ (మెయింటెనెన్స్) పనులు చేపట్టనున్నందున సోమవారం (08-06-2026) ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ వేంపల్లె ఏఈ ఇంచార్జ్ మైకేల్ జాక్సన్ తెలిపారు.ఈ సమయంలో జమ్మి చెట్టు లైన్, ఎంఏహెచ్ ఫంక్షన్ హాల్ పరిసరాలు, ఐటీఐ సర్కిల్, నిమ్మకాయల మండీలు, గంటన్న బట్టీలు, ఎన్టీఆర్ సర్కిల్, లైన్స్ నగర్, ఫైర్ స్టేషన్ ప్రాంతం, రాయచోటి బైపాస్, ఆర్ఎన్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అదనంగా, ఐటీఐ ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడి పనుల కారణంగా ఐటీఐ సర్కిల్ పరిధిలో మాత్రమే ఉదయం 9 గంటల నుండి సాయంత్రం4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది అని తెలిపారు.అందువల్ల ప్రజలు ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకుని, నిర్వహణ పనులకు సహకరించాలని కోరారు.

# మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం

**- శక్తి యాప్ వినియోగంపై వివరించిన సి.ఐ నరసింహులు**

**వేంపల్లె - సూర్య వాస్తవం :**మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన 'శక్తి' యాప్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని వేంపల్లె సి.ఐ నరసింహులు సూచించారు. జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు వేంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సీ కాలనీలో మహిళా భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలకు శక్తి యాప్ ఉపయోగాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.సి.ఐ నరసింహులు మాట్లాడుతూ ప్రమాదకర పరిస్థితుల్లో శక్తి యాప్‌లోని ఎస్.ఓ.ఎస్ బటన్‌ను ఉపయోగించడం ద్వారా లేదా డయల్-112కు కాల్ చేయడం ద్వారా తక్షణ పోలీసు సహాయం పొందవచ్చన్నారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలు, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా డయల్-112, చైల్డ్ లైన్-1098, గృహ హింస బాధితుల కోసం 181, మహిళల వేధింపుల ఫిర్యాదుల కోసం 1091, సైబర్ నేరాల కోసం 1930 వంటి హెల్ప్‌లైన్ నంబర్ల వివరాలను తెలియజేశారు. మహిళలు తమ హక్కులు, భద్రతకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు, యువత పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా అధ్యక్షులు



**అనంతపురం - సూర్య వాస్తవం :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సింగనమలలో 1996 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు 30 సంవత్సరాల తర్వాత "పూర్వ విద్యార్థుల సమ్మేళనం" కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా అధ్యక్షులు యు. రమణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని, తమతో చదువుకున్న మిత్రులతో కలిసి పాత మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.గురువులను శాలువాతో సత్కరించే కార్యక్రమంలో యు. రమణ మాదిగ పాల్గొని, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు కృతజ్ఞతలు తెలియజేశారు. "30 ఏళ్ల తర్వాత మళ్ళీ మా పాఠశాలలో మిత్రులతో కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది" అని ఆయన అన్నారు.బైకులపై హెల్మెట్, కారులో సీట్ బెల్ట్ ధరించి మిత్రులు క్షేమంగా వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎస్ఎస్సీలో సరస్వతి విద్యా మందిరాల్లో 100% పామిడి విద్యా మందిరం

**దక్షిణమధ్య క్షేత్ర అధ్యక్షులు డా, చామర్తి ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా.సి.ఆర్. శ్రీనివాసన్ కు ఘన సత్కారం**






**పామిడి- సూర్య వాస్తవం:** విద్యా భారతి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సరస్వతీ విద్యా మందిరాల ప్రధానాచార్యుల వర్షారంభ సమావేశం 6,7 తేదీలలో విశాఖపట్నంలో జరిగింది. ఈ సమావేశంలో 7వ తేదిన 10వ తరగతిలో 100శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానాచార్యుల సన్మానం జరిగింది. రాయలసీమ జిల్లాలో గల విద్యా మందిరాలలో పామిడి ఉన్నత పాఠశాల 100శాతం పలితాలు సాధించినందుకు శ్రీ సరస్వతీ విద్యా మందిరం ఉన్నత పాఠశాల పామిడి ప్రధానాచార్యులు సిఆర్ శ్రీనివాసన్‌ని విద్యాభారతి దక్షిణమధ్య క్షేత్ర అధ్యక్షులు డా చామర్తి ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఆచార్య గొల్లపల్లి నాగేశ్వరరావు, సంఘటనా కార్యదర్శి శ్రీ లింగం సుధాకర్ రెడ్డి, కార్యదర్శి శ్రీ ఆయాచితుల లక్ష్మణ రావు చేతుల మీదుగా సన్మానం, చేసి మోమెంటో, ప్రశంసా పత్రం అందచేసారు. అదేవిధంగా 10వ తరగతిలో 540 పైగా మార్కులు సాధించిన విద్యార్థు లకు షీల్డ్‌కు అందచేసారు. విద్యార్థులకు పాఠశాల వద్ద గౌరవ ప్రబంధకారిణి సభ్యుల ద్వారా అందచేయాలని తెలిపారు.

# మృతుల కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం

**- అందజేసిన ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడిసిసి బ్యాంక్ చైర్మన్**
**- ముంటిమడుగు కేశవరెడ్డి ఎక్స్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి**

**గార్లదిన్నె- సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలం కల్లూరు ఆర్ ఎస్ గ్రామంలో నివాసముంటున్న రమేష్ మరణించారు విషయం తెలుసుకొని వారి కుటుంబానికి మీకు అండగా మే ముంటాము అని భరోసా ఇచ్చి రూ.10వేలు ఆర్థిక సహాయం చేసిన నిరుపేదల పెన్నిధి బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి ఉమ్మడి అనంతపురం జిల్లా ఏ డి సి సి బ్యాంక్ చైర్మన్ మరియు శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, ఎక్స్ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# వచ్చేస్తోంది బిగ్ బాస్ 10.. నాగార్జున 'దశావతారం' ప్రోమో వచ్చేసింది!

**బిగ్ బాస్ తెలుగు పదో సీజన్‌కు రంగం సిద్ధం**
**నాగార్జున హోస్ట్‌గా 'దశావతారం' కాన్సెప్ట్‌తో కొత్త ప్రోమో**
**గత సీజన్ల అనుభవాలతో ప్రేక్షకుల్లో పెరుగుతున్న అనుమానాలు**
**ప్రోమోతో హైప్.. కంటెంట్ ఎలా ఉంటుందోనని నెటిజన్ల ప్రశ్నలు**
**ప్రస్తుతం కంటెస్టెంట్ల వేటలో నిమగ్నమైన బిగ్ బాస్ టీమ్**




బుల్లితెరపై అత్యంత ప్రేక్షకాదరణ పొందిన రియాలిటీ షో 'బిగ్ బాస్ తెలుగు' పదో సీజన్‌తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే తొమ్మిది సీజన్లను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ షో, ఇప్పుడు ఒక మైలురాయి లాంటి పదో సీజన్‌లోకి అడుగుపెడుతోంది. కింగ్ నాగార్జున మరోసారి హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ ల్యాండ్‌మార్క్ సీజన్‌కు 'దశావతారం' అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ స్టార్ మా, డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ అధికారిక ప్రోమోను విడుదల చేశాయి.

ఏమిటీ 'దశావతారం' కాన్సెప్ట్?
తాజాగా విడుదలైన ప్రోమోలో హోస్ట్ అక్కినేని నాగార్జున సరికొత్త స్టైలిష్ లుక్‌లో కనిపించారు. పదో సీజన్ కావడంతో, ఈ పదేళ్ల ప్రయాణాన్ని గుర్తుచేస్తూ పది రకాల సరికొత్త అవతారాలతో వినోదం, డ్రామా, ట్విస్టులు అంతకుమించి ఉంటాయని నాగార్జున హింట్ ఇచ్చారు. ఈ ప్రోమో ద్వారా షోపై అంచనాలను భారీగా పెంచే ప్రయత్నం చేశారు. ఈ ప్రత్యేకమైన సీజన్ కోసం బిగ్ బాస్ హౌస్‌ను కూడా గతంలో కంటే వినూత్నంగా తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం.

ప్రేక్షకుల్లో ఎందుకీ సందేహాలు?
ప్రోమో ద్వారా అంచనాలు పెంచడం బాగానే ఉన్నా, గత అనుభవాల దృష్ట్యా కొందరు నెటిజన్లు, ప్రేక్షకులు పెదవి విరుస్తున్నారు. గత సీజన్‌లో 'ఉల్టా-పుల్టా' అంటూ భారీ హైప్ ఇచ్చినా, చివరికి షో రొటీన్ టాస్కులు, గ్రూపిజం, అవే గొడవలతోనే సాగిందనే విమర్శలు వచ్చాయి. ఇప్పుడు కూడా 'దశావతారం' అంటూ క్లాస్ ప్రోమో వదిలారు కానీ, షో ప్రారంభమయ్యాక కంటెంట్ నిజంగా కొత్తగా ఉంటుందా లేక ఎప్పటిలాగే నీరసంగా సాగుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. హైప్ క్రియేట్ చేయడంలో సక్సెస్ అవుతున్న మేకర్స్, కంటెంట్ విషయంలో తేలిపోతున్నారనేది ప్రధాన విమర్శ.

కంటెస్టెంట్ల వేట షురూ
ప్రస్తుతం బిగ్ బాస్ నిర్వాహకులు పదో సీజన్ కోసం కంటెస్టెంట్ల వేటలో నిమగ్నమయ్యారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, బుల్లితెర నటీనటులు, కొంతమంది వివాదాస్పద సెలబ్రిటీలను సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. వీలైనంత త్వరగా ఈ సీజన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొత్తంమీద, 'దశావతారం' కాన్సెప్ట్‌తో బిగ్ బాస్ 10పై భారీ అంచనాలే ఉన్నాయి. అయితే, కేవలం ప్రోమోలకే పరిమితం కాకుండా, కంటెంట్‌లో కూడా కొత్తదనం చూపిస్తేనే ఈ ల్యాండ్‌మార్క్ సీజన్ విజయవంతం అవుతుందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు.

# అలాంటి పాత్రలకు మమ్మల్ని ఎందుకు నిందిస్తారు?: డింపుల్ హయతి ఆవేదన

**హీరోయిన్ల పాత్రల విషయంలో నటీమణులను నిందించడంపై డింపుల్ హయతి స్పందన**
**తప్పు నటీమణులది కాదు, దర్శకనిర్మాతలు, వ్యవస్థదేనని వ్యాఖ్య**
**వచ్చిన అవకాశాలతోనే పైకి రావాలని ప్రయత్నిస్తామని వెల్లడి**
**హీరో ప్రాధాన్యమున్న కథల్లో నటీమణులకు స్వేచ్ఛ ఉండదని ఆవేదన**
**మనకు మంచి సినిమాలు, మెరుగైన అనుభవాలు అవసరమని పిలుపు**



టాలీవుడ్ నటి డింపుల్ హయతి సినీ పరిశ్రమలో హీరోయిన్లకు ఇస్తున్న పాత్రలపై, వారిని నిందించే ధోరణిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బలహీనమైన పాత్రలు చేసినందుకు నటీమణులను నిందించడం సరికాదని, అసలు తప్పు అలాంటి పాత్రలే అమ్ముడవుతాయని నమ్మే వ్యవస్థది, దర్శకనిర్మాతలదని ఆమె స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. 'పెద్ది'లో జాన్వీ కపూర్ వంటి స్టార్ హీరోయిన్ కు ఇచ్చిన పాత్రపై తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో డింపుల్ హయతి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

"ఈ రోజు మనం నటీమణుల పాత్రలు ఎలా రాస్తున్నారు అనే దాని గురించి మాట్లాడుకుంటున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఒక పాత్ర చేసిన తర్వాత వెంటనే ఆ నటిని నిందించే ధోరణి కనిపిస్తోంది. కానీ, దయచేసి నటిని నిందించకండి. వ్యవస్థను, మేకర్స్‌ను నిందించండి. ఎందుకంటే, ఏది అమ్ముడుపోతుందని వారు నమ్ముతారో, అలాంటి పాత్రలనే సృష్టిస్తారు.

మేము నటీనటులుగా, మాకు లభించిన అవకాశాల పరిధిలోనే పనిచేస్తాం. వాటితోనే పెద్ద సినిమాలు చేసి, ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువవ్వాలని ఆశిస్తాం. ఒకవేళ పాత్రలు బలంగా లేకపోతే, ఆ బాధ్యత ఆ పాత్రను పోషించిన నటిపై కాకుండా, ఆ కథను రాసిన రచయితలు, తీసిన దర్శకులపైనే ఎక్కువగా ఉంటుంది.

దురదృష్టవశాత్తు, మేము పోషించే పాత్రల వల్ల మమ్మల్ని ఒక మూసలో బంధించేస్తున్నారు. మా పూర్తి నటనను ప్రదర్శించే అవకాశం ఇవ్వకుండానే ఒక ఇమేజ్‌ను కట్టబెడుతున్నారు. అదే హీరో సెంట్రిక్ కథల విషయానికొస్తే, వారికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. మనం ఏది చూస్తామో దాన్నే నమ్ముతాం. కానీ, సినిమా నిర్మాణం వెనుక ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఇది ఒక్కరి చేతిలో ఉండే నిర్ణయం కాదు.

అయితే, మనందరం కలిసి ఏకగ్రీవంగా ఒక విషయాన్ని చెప్పగలం. మనం ఇంకా మంచి అనుభవాలకు, మెరుగైన చిత్ర నిర్మాణానికి అర్హులం. దాని కోసం అందరం కలిసి నిలబడాలి" అంటూ ట్వీట్ చేశారు.






# అఫ్గాన్‌పై భారత్ ఆధిపత్యం.. ఫాలోఆన్ ముంగిట పర్యాటక జట్టు

ముల్లాన్‌పూర్: అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌పై భారత జట్టు తొలి రోజే సాధించిన ఆధిపత్యాన్ని రెండో రోజు మరింత సుస్థిరం చేసుకుని, మ్యాచ్‌ను పూర్తిగా తన గుప్పిట్లోకి తెచ్చుకుంది. 368/3 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్.. అఫ్గాన్ బౌలర్లను ముప్పుతిప్పలు పెడుతూ 8 వికెట్ల నష్టానికి 564 పరుగుల భారీ స్కోరు వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.


ఓవర్‌నైట్ సెంచరీ హీరో శుభ్‌మన్ గిల్ (126) మరోసారి క్లాస్ ఇన్నింగ్స్‌తో అలరించగా, రిషభ్ పంత్ 81 పరుగుల క్లాసిక్ నాక్‌తోనూ, ఆఖర్లో వాషింగ్టన్ సుందర్ (52 నాటౌట్) బాధ్యతాయుత హాఫ్ సెంచరీతోనూ మెరిశారు. అఫ్గాన్ బౌలర్లలో మహ్మద్ సలీమ్ సఫీ 6 వికెట్లతో ఒంటరి పోరాటం చేసినా భారత బ్యాటర్ల జోరును అడ్డుకోలేకపోయాడు.

అనంతరం భారత బౌలర్ల ధాటికి అఫ్గానిస్థాన్ టాప్ ఆర్డర్ క్రీజులో నిలవలేక పూర్తిగా విలవిల్లాడింది. ప్రసిద్ధ్ కృష్ణ, మానవ్ సుతార్ చెరో రెండు వికెట్ల ప్రదర్శన చేయడంలో అఫ్గాన్ బ్యాటర్లు అబ్దుల్ మాలిక్ (16), సెదిఖుల్లా అటల్ (17), రహ్మానుల్లా గుర్బాజ్ (12), హస్మతుల్లా షాహిది (20) తక్కువ పరుగులకే చేతులెత్తేశారు.

రెండో రోజు ఆట ముగిసే సమయానికి అఫ్గానిస్థాన్ 5 వికెట్ల నష్టానికి 113 పరుగులు మాత్రమే చేసి తీవ్ర పీకల్లోతు కష్టాల్లో పడింది. ప్రస్తుతం రహ్మత్ షా (43 నాటౌట్) ఒంటరి పోరాటం చేస్తుండగా, ఆ జట్టు ఇంకా 451 పరుగుల భారీ వెనకంజలో ఉంది. భారత్ ప్రదర్శించిన ఈ ఆల్‌రౌండ్ ఆధిపత్యంతో అఫ్గానిస్థాన్‌కు ఫాలోఆన్ గండం స్పష్టంగా కనిపిస్తోంది.

# తిలక్ వర్మకు రూ.33 లక్షలు

**-- సీవీ మిలింద్‌కు 17 లక్షలు, సిరాజ్‌కు 14 లక్షలు**
**-- క్రికెటర్లపై కాసుల వర్షం కురిపించిన టీజీ20 ఆటగాళ్ల వేలం**



హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్‌లో సరికొత్త అంకం. టీజీ20 ఆటగాళ్ల వేలంలో ఫ్రాంఛైజీలు క్రికెటర్లపై కాసుల వర్షం కురిపించాయి. దిగ్గజ క్రికెటర్లలో తిలక్ వర్మ రూ.33 లక్షలు (మెదక్ ఫాల్కన్స్) దక్కించుకోగా.. పేసర్ మహ్మద్ సిరాజ్ రూ.14 లక్షలు (వరంగల్ వారియర్స్), సీవీ మిలింద్ రూ.17 లక్షలు ( ఖమ్మం ఏసెస్) వేలంలో అత్యధిక ధర సొంతం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని రామోజి ఫిల్మ్‌సిటీలో ఆదివారం జరిగిన ఆటగాళ్ల వేలంలో 1300 మంది క్రికెటర్లు అదృష్టం పరీక్షించుకోగా.. 8 ఫ్రాంఛైజీలు 160 మంది క్రికెటర్లను కొనుగోలు చేశాయి. హెచ్‌సీఏ తరఫున రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహించిన క్రికెటర్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచిన ఫ్రాంఛైజీలు..

ఆ తర్వాత లీగ్ దశలో, జిల్లాల తరఫున ప్రాతినిధ్యం వహించిన క్రికెటర్లను తీసుకునేందుకు ఆసక్తి చూపించాయి. అన్‌క్యాప్డ్ ప్లేయర్లలో అత్యధిక ధర దక్కించుకున్న క్రికెటర్‌గా సీవీ మిలింద్ నిలిచాడు. దిగ్గజ ప్లేయర్ల జాబితా నుంచి మాజేటి రవి కిరణ్ రూ.13 లక్షలు (పాలమూరు స్ట్రయికర్స్), టి రవిజేత రూ.12 లక్షలు (మెదక్ ఫాల్కన్స్), తనయ్ త్యాగరాజన్ రూ. 11 లక్షలు (రంగారెడ్డి రైజర్స్), రాహుల్ బుద్ధి రూ. 8 లక్షలు (నల్గొండ నైట్స్), తన్మయ్ అగర్వాల్ రూ.8 లక్షలు (కరీంనగర్ డైమండ్స్), కొలగాని రోహిత్ రాయుడు రూ.6.5 లక్షలు (పాలమూరు స్ట్రయికర్స్) వేలంలో మంచి ధర దక్కించుకున్నారు.

ఏ ప్లస్ విభాగంలో ఆమన్ రావు రూ.12 లక్షలు (వరంగల్ వారియర్స్), ఎం. సాయి ప్రజ్ఞయ్ రెడ్డి రూ.11 లక్షలు (పాలమూరు స్ట్రయికర్స్), గంగపురం అజయ్ దేవ్ గౌడ్ రూ.11 లక్షలు (హైదరాబాద్ ఈ చాంపియన్స్), నోముల నితిన్ సాయి యాదవ్ రూ.9 లక్షలు (రంగారెడ్డి రైజర్స్), ఆరోన్ జార్జ్ రూ.7.5 లక్షలు (రంగారెడ్డి రైజర్స్), రక్షణ్ రెడ్డి రూ.6 లక్షలు (నల్గొండ నైట్స్)లు వేలంలో ఫ్రాంఛైజీలను ఆకర్షించారు. ఏ కేటగిరీ నుంచి అభిరాత్ రెడ్డి రూ. 11 లక్షల ధరకు హైదరాబాద్ ఈ చాంపియన్స్ సొంతమవగా.. అర్ఫాజ్ అహ్మద్ సైతం రూ. 11 లక్షలకు నల్గొండ నైట్స్ గూటికి చేరాడు.

**తిలక్‌కు రికార్డు ధర :** దేశవాళీ టీ20 లీగ్‌లలో తిలక్ వర్మ రికార్డు ధర దక్కించుకున్న ఆటగాడిగా నిలిచాడు. ఢిల్లీ ప్రీమియర్ లీగ్ (డీపీఎల్)లో సిమర్‌జిత్ సింగ్ రూ.39 లక్షలు దక్కించుకున్నా... అక్కడి వేలంలో ఫ్రాంఛైజీ పర్సు విలువ రూ. 1.5 కోట్లు.

టీజీ20లో ఫ్రాంఛైజీల పర్సు కేవలం రూ. 60 లక్షలు. అయినా, తిలక్ వర్మ ఏకంగా రూ.33 లక్షల రికార్డు దక్కించుకున్నాడు. యూపీ టీ20 లీగ్‌లో భువనేశ్వర్ కుమార్ రూ.30.25 లక్షలు, తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో ఆర్. సాయి కిశోర్ రూ. 22 లక్షలు, కర్ణాటక టీ20 లీగ్‌లో కరుణ్ నాయర్ రూ.18 లక్షలు, బెంగాల్ ప్రొ టీ20 లీగ్‌లో షాజాబ్ అహ్మద్ రూ. 12.2 లక్షలు, ముంబయి టీ20 లీగ్‌లో అథర్వ రూ.16.25 లక్షలతో అత్యధిక ధర దక్కించుకున్నారు. టీజీ20 తొలి సీజన్ ఈ నెల 21 నుంచి ఆరంభం కానుంది. 8 జట్లు పోటీపడుతున్న ఈ టీ20 లీగ్‌లో 21 రోజుల పాటు 32 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఆరంభ, ఫైనల్ మ్యాచ్‌లకు సహా అన్ని మ్యాచ్‌లకు ఉప్పల్ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది.

## మోడీది వాతల ప్రభుత్వం..
# చంద్రబాబుది కూతల ప్రభుత్వం

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లె - సూర్య వాస్తవం :** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం "వాతల ప్రభుత్వం"గా, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం "కూతల ప్రభుత్వం"గా మారిందని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విమర్శించారు. ఆదివారం వేంపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంటగ్యాస్ ధరలను వరుసగా పెంచడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతోందన్నారు. గృహ వినియోగంతో పాటు కమర్షియల్ గ్యాస్ ధరల పెంపు కారణంగా హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీ రంగాలు ప్రభావితమవుతున్నాయని తెలిపారు. సీఎన్జీ, పెట్రోలు, డీజిల్ ధరల పెరుగుదలతో రవాణా రంగం, సామాన్య ప్రజల జీవన వ్యయం పెరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు అధికంగా ఉన్నప్పటికీ దేశీయంగా ధరలను నియంత్రించామని, ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉందని పేర్కొన్నారు.

**రాయలసీమ అభివృద్ధిపై స్పందన**

రాయలసీమ అభివృద్ధిపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ఆచరణలో కనిపించడం లేదని తులసి రెడ్డి అన్నారు. కడప జిల్లాలో సమీకృత ఉక్కు కర్మాగారం ఏర్పాటులో పురోగతి లేదని, కడప--రాయచోటి--మదనపల్లి--బెంగళూరు బ్రాడ్‌గేజ్ రైల్వే ప్రాజెక్టు రాష్ట్ర వాటా నిధుల కొరతతో నిలిచిపోయిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వచ్చి పారిశ్రామిక, రైల్వే ప్రాజెక్టులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు
# ప్రతి ఒక్కరు పాటించాలి....!

**- మద్య మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు**
**- రోడ్డు భద్రతపై పోలీసులు ప్రత్యేక నిఘా**



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** ఇటీవల కాలంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరిక ట్టేందుకు, ప్రజా భద్రతను మెరుగుపరిచేందుకు అనంతపురం జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మద్యం సేవించి వాహనాలు నడపడం (డ్రంక్ అండ్ డ్రైవ్) వల్ల జరిగే నష్టాలపై ఒకవైపు ప్రజల్లో అవగాహన కల్పిస్తూనే, మరోవైపు నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

**సంచలనంగా మారుతున్న డ్రంక్ అండ్ డ్రైవ్**

**ప్రాణాలకే ముప్పు:** మద్యం మత్తులో వాహనంపై నియంత్రణ కోల్పోవడం వల్ల జరిగే ఘోర ప్రమాదాల్లో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొందరు శాశ్వత అంగవైకల్యానికి గురై కుటుంబాలకు భారమవుతున్నారు.

**భారీ జరిమానాలు - జైలు శిక్ష**

మోటారు వాహనాల చట్టం ప్రకారం డ్రంక్ అండ్ డ్రైవింగ్ కేసుల్లో పట్టుబడితే భారీ అపరాధ రుసుము విధించడమే కాకుండా, కోర్టు ద్వారా జైలు శిక్ష కూడా ఖరారయ్యే అవకాశం ఉంది. లైసెన్స్ రద్దు, క్రిమినల్ రికార్డ్,పదే పదే నిబంధనలు ఉల్లంఘించే వారి డ్రైవింగ్ లైసెన్స్‌ను శాశ్వతంగా రద్దు చేయనున్నారు. అంతేకాకుండా, పోలీస్ రికార్డుల్లో క్రిమినల్ కేసు నమోదు కావడం వల్ల యువత భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలకు, విదేశీ వీసాలకు అర్హత కోల్పోయే ప్రమాదం ఉందని అధికారులు స్పష్టం చేశారు. మద్యం సేవించి ప్రమాదాలకు గురైతే సదరు వాహనాలకు లేదా వ్యక్తులకు ఎలాంటి ఇన్సూరెన్స్ క్లెయిమ్ వర్తించదని, ఆర్థిక నష్టాలన్నీ స్వయంగా భరించాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**పోలీస్ శాఖ పిలుపు**

మీ ప్రయాణం సురక్షితంగా సాగాలి అంటే ట్రాఫిక్ నిబంధనలు పాటించండి. మద్యం సేవించినప్పుడు స్వయంగా డ్రైవింగ్ చేయకుండా, క్యాబ్ లేదా ప్రత్యామ్నాయ డ్రైవర్ల సహాయం తీసుకోండి అని స్థానిక పోలీస్ అధికారులు ప్రజలను కోరుతున్నారు. మైనర్ డ్రైవింగ్‌పై పోలీసుల కొరడా.. తల్లిదండ్రులకు జైలు శిక్ష, భారీ జరిమానాలు తప్పవు. ఇటీవల కాలంలో మైనర్లు (18 ఏళ్ల లోపు పిల్లలు) బైక్‌లు, కార్లతో రోడ్లపైకి వస్తూ ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు పెరిగిపోతుండటంపై జిల్లా రక్షకభట నిలయం (పోలీస్ శాఖ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సరదా కోసం, అవగాహన లేకుండా మైనర్లు వాహనాలు నడపడం వల్ల కలిగే నష్టాలపై పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా, కఠినమైన నిబంధనలను అమలు చేయనున్నారు. ఈ మేరకు కొత్త మోటారు వాహన చట్టం ప్రకారం మైనర్లు డ్రైవింగ్ చేస్తే ఎలాంటి తీవ్ర పరిణామాలు ఉంటాయో స్పష్టం చేశారు.

**చట్టపరమైన కఠిన చర్యలు:**

మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపితే, సదరు వాహన యజమానికి లేదా తల్లిదండ్రులకు 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ. 25,000 భారీ జరిమానా విధిస్తారు. వాహన రిజిస్ట్రేషన్ రద్దు: మైనర్ నడిపిన సదరు వాహనం యొక్క రిజిస్ట్రేషన్‌ను ఒక సంవత్సరం పాటు రద్దు చేయడం జరుగుతుంది. తప్పు చేసిన మైనర్‌కు 25 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు ఎలాంటి డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేయరు. దీనివల్ల వారి కెరీర్, ఉద్యోగ అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో వాహనాన్ని మైనర్ నడుపుతున్నట్లు తేలితే, సదరు వాహనానికి లేదా ప్రమాదంలో గాయపడిన వారికి ఇన్సూరెన్స్ కంపెనీల నుండి ఎటువంటి క్లెయిమ్ (డబ్బులు) రావు. నష్టపరిహారాన్ని పూర్తిగా తల్లిదండ్రులే సొంతంగా భరించాల్సి ఉంటుంది. పోలీసుల విజ్ఞప్తి పిల్లలపై ఉన్న ప్రేమతో వారికి బైక్‌లు ఇవ్వడం అంటే వారిని ప్రమాదంలోకి నెట్టడమే. మైనర్ల డ్రైవింగ్ వల్ల వారి ప్రాణాలకే కాకుండా, రోడ్డుపై వెళ్లే ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతోంది. కాబట్టి తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, పిల్లలకు 18 ఏళ్లు నిండి, లైసెన్స్ వచ్చే వరకు వాహనాలను ఇవ్వకూడదు. అని పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్నారు.

## ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్
# సాంబశివ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలి

**- వైసీపీ మైదుకూరు నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు భూమిరెడ్డి బాలకృష్ణ రెడ్డి**

**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలపై గత కొన్ని రోజులుగా పలు ఆరోపణలు వెలువడుతున్న నేపథ్యంలో, వాటిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను ప్రజలకు వెల్లడించాలని వైఎస్సార్సీపీ మైదుకూరు నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు భూమిరెడ్డి బాలకృష్ణ రెడ్డి డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామక ప్రక్రియపై అభ్యర్థులు, నిరుద్యోగ యువత మరియు ప్రజల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అయితే ఆరోపణలకు సమాధానం ఇవ్వాల్సిన ప్రభుత్వం, వాటిని ఖండించేందుకు సమావేశాలు నిర్వహించడం అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు. ఇటీవల కడపలో నిర్వహించిన సమావేశంలో డీఎస్సీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగిందని పేర్కొన్నప్పటికీ, ప్రజల్లో నెలకొన్న అనుమానాలను తొలగించే విధంగా స్పష్టమైన ఆధారాలను ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. అదేవిధంగా, ప్రభుత్వ కార్యక్రమం కాని ఒక సమావేశంలో జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సాంబశివ రెడ్డి పాల్గొనడం, నిర్వాహక పాత్ర పోషించడం పట్ల పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ లేదా పక్షపాత కార్యక్రమాలకు దూరంగా ఉండాలనే నిబంధనలు ఉన్న నేపథ్యంలో, ఈ వ్యవహారంపై సంబంధిత ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో విమర్శలను అణిచివేయడం కాకుండా, వచ్చిన ఆరోపణలపై పారదర్శకంగా స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే సరైన మార్గమని పేర్కొన్నారు. డీఎస్సీ అభ్యర్థుల భవిష్యత్తు, నిరుద్యోగ యువత ఆశలు మరియు ప్రజల విశ్వాసాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అంశంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సాంబశివ రెడ్డిపై సోమవారం జరిగే గ్రీవెన్స్ కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనడం నిబంధనలకు విరుద్ధమని ఆరోపిస్తూ, ఆయనపై విచారణ జరిపి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.






## స్థానిక సంస్థల ఎన్నికల్లో
# వైసీపీ విజయం సాధించాలి

**- వైసీ గోవర్ధన్ రెడ్డి**

**మడకశిర - సూర్య వాస్తవం :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు వైసీ గోవర్ధన్ రెడ్డి పిలుపు నిచ్చారు.?మడకశిర పట్టణంలో ఇటీవల వివిధ కమిటీలకు నూతనంగా నియమితులైన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ఆదివారం వైసీ గోవర్ధన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. పార్టీలో తమకు అవకాశం కల్పించి నందుకు వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా ఎంపికైన కమిటీల సభ్యులు నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ బలోపేతానికి శ్రమించాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండ గడుతూ, ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మడకశిర పట్టణ వైకాపా యువజన విభాగం అధ్యక్షుడు బాబు, ఎస్సీ విభాగం పట్టణ కార్యదర్శి నరసింహులుతో పాటు పలువురు స్థానిక నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కూటమిలో
# 'రాజ్యసభ' సెగలు

**-- అభ్యర్థుల ఎంపికపై ఆశావహుల అసంతృప్తి**
**-కార్పొరేట్లకే కట్టబెట్టడంపై విమర్శలు**
**-కార్యకర్తలకు గుర్తింపులేదన్న కడప నేత శ్రీనివాస రెడ్డి**



**అమరావతి - సూర్య వాస్తవం :**

టిడిపి కూటమిలో రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో అసంతృప్తి నెలకొంది. పెద్దల సభకు కార్పొరేట్ వ్యక్తులను పంపితే ప్రజల తరపున ఎలా మాట్లాడతారని ఒక వైపు ఆందోళన వ్యక్తం చేస్తుండగా పార్టీ కోసం కష్టపడ్డ తమకు అవకాశం దక్కలేదని రాజ్యసభ సీట్లు ఆశించిన నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొందరు నేతలు ఈ విషయాన్ని బహిరంగపరచగా, మరికొంత మంది లోలోపలే తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కడప జిల్లాకు చెందిన సీనియర్ నేత రెడ్డప్పగారి శ్రీనివాసులు రెడ్డి తన అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేశారు. తనకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడం తన రాజకీయ జీవితంలో అత్యంత నిరాశ కలిగించిందని సామాజిక మాధ్యమాలలో ఆదివారం పొందుపరిచారు. '13 ఏళ్లుగా కడప లాంటి అత్యంత క్లిష్టమైన రాజకీయ పరిస్థితులు ఉన్న జిల్లాలో తెలుగుదేశం పార్టీకి అండగా నిలుస్తూ, పార్టీని బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేశాను. రాజకీయ, ఆర్థిక, మానసిక, శారీరక ఒత్తిళ్లను ఎదుర్కొంటూ పార్టీ జెండా ఎప్పటికీ ఎగురుతూ ఉండాలనే సంకల్పంతో పని చేశాను. పార్టీ అధిష్టానం నాకు రాజ్యసభ సభ్యత్వం ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడం వ్యక్తిగతంగా ఎంతో కలతకు గురి చేసింది. పార్టీ కోసం నిస్వార్థంగా శ్రమించిన నాయకులను, కార్యకర్తలను తగిన సమయంలో గుర్తించకపోవడం బాధాకరం' అని పేర్కొన్నారు. టిడిపిలోనే పార్టీ సీనియర్ నేతగా ఉన్న వర్ల రామయ్య కూడా తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు సమాచారం. 2018లోనే ఆయనకు చేతిదాక వచ్చిన అవకాశాన్ని కనకమేడల రవీంద్రనాథ్‌కు కేటాయించారు. ఈ దఫా అయినా వర్లకు దక్కుతుందని పార్టీలో అందరూ భావించారు. ఇప్పటికీ కూడా పార్టీ కార్యాలయానికి రోజు వచ్చే నేతల్లో ఆయన ఒక్కడే. అయితే ఈ సారి కూడా అవకాశం దక్కకపోవడంతో కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తునట్లు సమాచారం. యనమల రామకృష్ణుడు, దువ్వారపు రామారావు, గుండుమల తిప్పేస్వామి, టిడి జనార్ధన్, కంభంపాటి రామ్మోహన్ వంటి నేతలు కూడా రాజ్యసభ అవకాశం దక్కకపోవడంతో అసంతృప్తి చెందినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు.

**'జనసేనలో 'లింగమనేని' అసంతృప్తి**

జనసేనకు వచ్చిన రాజ్యసభ సీటును ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్‌కు కేటాయించడంతో ఆ పార్టీలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రమేష్ ఇప్పటివరకు జనసేన జెండా మోయలేదని, అలాంటి వ్యక్తికి టికెట్ ఎలా ఇస్తారని ఆ పార్టీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా ఒక కార్పొరేట్ వ్యక్తికి ఇవ్వడం ద్వారా సాధారణ కార్యకర్తలకు ఎలాంటి సందేశం ఇస్తారనే ప్రశ్న ఆ పార్టీ నేతల్లో నెలకొంది. పార్టీలో కేవలం రెండు సామాజిక వర్గాల నేతలకే అవకాశం దక్కుతున్నాయని అసంతృప్తి కూడా ఉంది. 2024లో వైసిపి రాజ్యసభ సభ్యులు రాజీనామా చేసిన సమయంలో జనసేన నుంచి నాగబాబు రాజ్యసభ సీటును ఆశించారు. అయితే ఆ సమయంలో నాగబాబును మంత్రివర్గంలో తీసుకుంటామని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గతేడాది ఎమ్మెల్సీగా నాగబాబుకు అవకాశం ఇచ్చారే తప్ప ఇప్పటికీ మంత్రివర్గంలోకి తీసుకోలేదు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )